# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక: 150 హైదరాబాద్, 30-11-2025, ఆదివారం పేజీలు: 12 వెల: 1.00


## తెలంగాణకు మొదట్నుంచీ కాంగ్రెస్ విలన్: కేటీఆర్

హైదరాబాద్: కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో తాము పోరాడుతున్నట్లు మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు మొదట్నుంచీ కాంగ్రెస్ విలన్ అని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ పేరు లేకుండా ఒక్క ప్రసంగమైనా చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు."కేసీఆర్ ఏడాదిన్నరగా బయటకు రావట్లేదని అంటున్నారు. గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా సైలెంట్‌గానే ఉంటుంది. నాయకుడు ఎప్పటికైనా నాయకుడే. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వస్తే సంగతి తెలుస్తుంది. తెలంగాణ తల్లిని అవమానించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోంది.

## బైక్ ట్యాక్సీ డ్రైవర్ ఖాతాలో రూ.331 కోట్లు

### ఈడీ విచారణలో ఆసక్తికరమైన నిజాలు

దిల్లీ: నవంబర్ 29(భారత శక్తి ):బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పొట్టకూటి కోసం బైక్ ట్యాక్సీ నడిపే ఓ డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ. 331 కోట్లు డిపాజిట్ అయినట్లు గుర్తించింది. 1ఎక్స్‌బెట్ సంస్థకు చెందిన ఆన్‌లైన్ బెట్టింగ్‌తో ముడిపడిన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఈ వివరాలను సేకరించింది. డ్రైవరు బ్యాంకు ఖాతాలో 2024 ఆగస్టు 19 నుంచి 2025 ఏప్రిల్ 16 వరకూ రూ. 331 కోట్ల మేర డిపాజిట్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలో పేర్కొన్న చిరునామాకు వెళ్లి దర్యాప్తు చేపట్టగా.. ఆ ఖాతాదారుడు ఒక ప్రసిద్ధ క్యాబ్ అగ్రిగేటర్ సంస్థ కోసం పని చేస్తున్నాడని, దిల్లీలోని ఒక మురికివాడలో రెండు గదుల ఇంట్లో నివసిస్తున్నట్లు తేలింది. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ బైక్ డ్రైవర్ ఖాతా నుంచి రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు కోటి రూపాయలు చెల్లించడం గమనార్హం. ఆ వివాహం గుజరాత్‌కు చెందిన ఒక యువ రాజకీయ నేతకు సంబంధించినట్లు గుర్తించారు.



## అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదు: సజ్జనార్

గౌతంనగర్: నవంబర్ 29(భారత శక్తి ):దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు మెమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## ఐబొమ్మ.. బప్పం.. అసలు కథ చెప్పిన ఇమంది రవి

హైదరాబాద్: నవంబర్ 29(భారత శక్తి ):ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు.

నేటితో నిందితుడి రెండో విడత కస్టడీ పూర్తయ్యింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు.

## విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలి: భట్టి విక్రమార్క



హైదరాబాద్: నవంబర్ 29(భారత శక్తి ): రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, భవిష్యత్ అవసరాలపై భట్టి మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. విద్యుత్ డిమాండ్ సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు." 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలి. 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉ ంటుంది. విద్యుత్ స్టోరేజ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదు. విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్‌డ్ స్టోరేజ్‌ల్లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్‌డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉంది" అని భట్టి అన్నారు.(

## దీక్షా దివస్ పేరుతో BRS డ్రామాలను ప్రజలు విశ్వసించరు: మంత్రి సీతక్క



హైదరాబాద్: నవంబర్ 29(భారత శక్తి ):BRS అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో BRS నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు.

"తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమే. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం..

లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో BRS చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు" అని మంత్రి అన్నారు.

నాంపల్లి కోర్టుకు హాజరైన సీతక్క

కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు

## కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను తనిఖీ చేసిన కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి





వరంగల్, నవంబర్ 29(భారత శక్తి ):కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నవంబర్ 29 , 2025న సందర్శించారు . దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ శ్రీ బిజయ్ కుమార్ రత్, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, ఆర్.వి.ఎన్.ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.వి సాయిప్రసాద్, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ నిర్మాణంలోనున్న ప్రదేశాలను సందర్శించి , కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు మరియు పని ప్రదేశాలలో తీసుకుంటున్న భద్రతా చర్యలను కూడా ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం త్వరలో సాకారమవ్వబోతోందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023లో కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును రూ. 521 కోట్ల వ్యయంతో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్) నిర్మాణం చేపట్టిందని ఆయన తెలియజేశారు. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో ప్రధాన షాప్, టెస్ట్ షాప్, పెయింట్ షాప్, స్టోర్ వార్డ్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, రెస్ట్ హౌస్, సెక్యూరిటీ, టాయిలెట్ బ్లాక్‌లు, సరిహద్దు గోడ, ఆర్.యు.బి, అంతర్గత రైల్వే ట్రాక్, రోడ్లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, క్యాంటీన్‌లను నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా, 1 మెగావాట్ల పైకప్పు సోలార్ ప్లాంట్, పగటిపూట సహజంగా గాలి వెలుతురు అందే విధంగా ఏర్పాటు, ఎల్.ఇ.డి లైటింగ్, మురుగునీటి శుద్ధి కర్మాగారం, వ్యర్థ జలాల రీసైక్లింగ్ ప్లాంట్, ఇంకుడుగుంతల ఏర్పాటు ద్వారా నీటి పొదుపు మొదలైన పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి ఇప్పటికీ 75 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. ఆర్.ఎం.యులో 16 కోచ్ల మెము రేక్‌లను తయారు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. రాబోయే రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు లో ఈ ప్రాంతంలోని యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు అపూర్వమైన అభివృద్ధిని సాధిస్తున్నాయని, అది వందే భారత్ రైళ్లు, విద్యుదీకరణ, కొత్త రైళ్లు, అమృత్ స్టేష న్లు, కవచ్ మొదలైనవి ఉన్నాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ముందుగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్వాగతోపన్యాసం చేశారు. ఆర్.వి.ఎన్.ఎల్. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పి .వి.సాయిప్రసాద్ ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్యాంశాలను మీడియాకు వివరించారుముందుగా ఈరోజు ఉదయాన జి. కిషన్ రెడ్డి వరంగల్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రైలు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మరియు ప్రయాణీకుల అనుభూతిని పెంపొందించడం అనే లక్ష్యంగా వరంగల్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు మరియు ప్రయాణీకుల సౌకర్యాలు వసతులను ఆయన సమీక్షించారు. ఈ సమీక్షలో వారితోపాటు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ అధికారులు హాజరయ్యారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# దృష్టి పెట్టాల్సింది బోధనపైనే...


మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఉద్ఘాటించినట్లు- అత్యుత్తమ ప్రతిభావంతులకు, మేటి వ్యక్తిత్వ సంపన్నులకు దేశం నెలవు కావాలంటే తల్లి, తండ్రి, గురువులతోనే సాధ్యం. మంచీ చెడూ తెలియజెప్పి పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో అమ్మానాన్నలు తొలివరసలో నిలుస్తారు. ఉపాధ్యాయులేమో ఆ చిన్నారులకు ప్రాపంచిక జ్ఞానాన్ని బోధిస్తూ, యుక్తాయుక్త విచక్షణను, తార్కిక ఆలోచనను, ఆత్మవిశ్వాసాన్ని సైతం అలవరచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు. ఒక ఇంజినీరు సరిగ్గా పనిచేయకపోతే ఓ భవనమో వంతెనో కూలిపోతుంది. ఒక వైద్యుడు విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఓ ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. కానీ, తమ బాధ్యతలో అధ్యాపకులు అశ్రద్ధ వహిస్తే ఓ తరం భవిష్యత్తే అంధకారంలో కూరుకుపోతుంది. అందుకే గురువుల దృష్టి అంతా తరగతి గదులపైనే ఉండాలి. విద్యార్థులను మేలిమి వజ్రాలుగా సానబట్టడమే వారి లక్ష్యం కావాలి. కానీ, తాము బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తున్నట్లు తెలంగాణలో పాతికశాతం ఉపాధ్యాయులు తాజా సర్వేలో వెల్లడించారు. చదువు చెప్పలేకపోతున్నామన్న బాధ టీచర్లలో తలెత్తకుండా, బోధనలో వారు రాణించగలిగే విధంగా ప్రభుత్వాలు తక్షణం శ్రద్ధ వహించాలి. సమర్థ శిక్షణతో ఉపాధ్యాయుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచాలి!

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో ప్రధాన భూమిక ఉపాధ్యాయులదే. అందుకే గురు బ్రహ్మ గురుర్విష్ణు అంటూ మన సంస్కృతి వారిని కీర్తిస్తోంది. అలా జాతి తలరాతను మార్చి రాసే టీచర్ల శిక్షణ ఎలా సాగుతోందో చూస్తే- ఆవేదనే మిగులుతుంది. కాసులే పరమావధిగా చాలా బీఈడీ కాలేజీలు క్లాసులు సైతం చెప్పకుండా పట్టాలు చేతిలో పెట్టేస్తున్నాయి. దాంతో ఎంతోమందిలో బోధనా సామర్థ్యాలు కొరవడుతున్నాయి. మరోవైపు ఎన్నో ప్రభుత్వ బడుల్లో అవసరానికి మించి టీచర్లు ఉంటుంటే- కొన్నిచోట్ల తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేక పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తుపై కారుచీకట్లు కమ్ముకొంటున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ బడుల్లో చేరికలు తగ్గిపోతున్నాయి. కానీ, వేలకు వేలు ధారపోసి చదువును కొనలేని పేద, బడుగు బలహీనవర్గాల పిల్లలకు అవే ఆశాదీపాలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సర్కారీ బడుల్లో బోధన నాణ్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టిసారించకపోతే- అసహాయ కుటుంబాల చిన్నారులకు ఇంకా అన్యాయం చేసినట్లు అవుతుంది. ఆర్థిక సామాజిక అసమానతలను అది మరింతగా ఎగదోస్తుంది!

ఏ దేశమైనా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చదువే ఆలంబన అవుతుంది. దీన్ని గుర్తించి దక్షిణ కొరియా, సింగపూర్, జపాన్, ఫిన్లాండ్ లాంటివి మెరికల్లాంటి వారిని ఉపాధ్యాయ వృత్తిలోకి రప్పిస్తున్నాయి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా టీచర్లకు ఎప్పటికప్పుడు సమర్థ శిక్షణ అందిస్తూ, భావిపౌరులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుకొంటున్నాయి. తద్వారా జ్ఞానాధారిత ప్రపంచంలో అవి గెలుపు జెండా ఎగరేస్తున్నాయి. మన దేశంలోనేమో అందుకు భిన్నమైన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. నిరుటి అసర్ నివేదిక ప్రకారం- దేశీయంగా అయిదో తరగతి విద్యార్థుల్లో సగం మందే రెండో క్లాసు పాఠాలు చదవగలరు! చిన్నచిన్న భాగహారాలు చేయమంటే తెల్లముఖాలు వేసే వారికీ కొదవలేదు. ఇలా అరకొర జ్ఞానంతో ఏదో ఒకటి ముక్కునపట్టి పరీక్షల్లో పాసైపోతున్నవారు అంతిమంగా ఉపాధి వేటలో కళ్లు తేలేస్తున్నారు. ఈ దుస్థితిని పరిమార్చాలంటే- ఉపాధ్యాయ శిక్షణను లోపరహితం చేసి నవీన బోధనా పద్ధతులకు ఎర్రతివాచీ పరవాలి. సర్కారీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూనే బట్టీ చదువులను సాకల్యంగా సంస్కరించాలి!

# విలీన గ్రామాల్లో రాజకీయ స్తబ్ధత

కరీంనగర్ నవంబర్ 29(భారత శక్తి ): మొన్నటి ఎన్నికల వరకు అవన్నీ గ్రామ పంచాయతీలు... పంచాయతీ ఎన్నికల నగరా మోగితే చాలు... ఎటుచూసినా ఎన్నికల హడావుడి కనిపించేది. ఓవైపు సర్పంచు పదవులను ఆశించేవారు. మరోవైపు వార్డు సభ్యుల పదవులకు పోటీపడే వారు ఓటర్ల వద్దకు వచ్చి మద్దతు కోసం ప్రాధేయపడేవారు. కరీంనగర్‌కు అత్యంత చేరువలో ఉన్న పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్, సదాశివపల్లి, అల్గునూర్ గ్రామపంచాయతీల్లో రాజకీయ హడావుడి మరింత ఎక్కువగా ఉండేది. పేరుకే అవి గ్రామ పంచాయతీలు అయినప్పటికీ అక్కడ అంత నగరీకరణ చోటు చేసుకోవడంతో అక్కడి ఇళ్లు, భూములకు నగరంలోని విలువ ఉండేవి. దీంతో పంచాయతీలకు పోటీ చేసే వారు ఎంత డబ్బైనా ఖర్చు పెట్టేందుకు పోటీపడే వారు. ఇప్పుడు ఆ



గ్రామాలన్నీ నగరపాలక సంస్థలోనే విలీనం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికలతో ఆ గ్రామాలకు (విలీన డివిజన్ల) సంబంధం లేకుండా పోయింది. దీంతో ఆయా గ్రామాల్లో రాజకీయ విరామం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల పరిధిలోని ఈ గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో మండలాల్లో గ్రామాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్య 66కు చేరింది.

కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దంటూ ప్రజలు వ్యతిరేకించినప్పటికీ నగరీకరణలో భాగంగా సమీపంలోని గ్రామాలను విలీనం చేశారు. గ్రామాల విలీనంతో తమకు పన్నుల భారమే తప్ప అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఒరిగిందేమి లేదని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలు ఉంటే ఒక్కో గ్రామంలో 5,6 నుంచి 10 వార్డు సభ్యులు, సర్పంచు, ఉపసర్పంచు పదువులు ఉండేవి. ఎంపీటీసీ, మండల స్థాయిలో జడ్పీటీసీ పదవులు ఉండేవి. కార్పొరేషన్‌లో విలీనంతో ఆ పదవులన్నీ పోయి పంచాయతీ పరిధిలో ఒక్క కార్పొరేటర్ పదవి మాత్రమే దక్కుతుందని రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థాయిని బట్టి ఎవరి హోదాలో వారు వార్డు సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు పోటీపడే వారమని, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. దాదాపు ఐదు వేల ఓటర్లతో నగరపాలక సంస్థలో డివిజన్లను ఏర్పాటు చేయడంతో కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలువడం అందరకీ సాధ్య కాదని, వార్డుసభ్యులేకాదు ఉప సర్పంచ్, సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి నాయకులు పోటీకి జంకుతున్నారు. విలీనంతో తమ పదవులు ఊడడమే కాకుండా రాజకీయ భవిష్యత్ లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో విలీన గ్రామాల్లో మున్సిపల్ ఎన్నికలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు వస్తాయి.. ఇప్పట్లో ఉంటాయా, ఎవరు పోటీచేస్తారు... డివిజన్ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంది... రిజర్వేషన్ ఏమైనా తెలిసిందా అంటూ నలుగురు కలిస్తే ముచ్చటిచుకుంటున్నారు.

# ఖర్చుల గుబులు

జగిత్యాల, నవంబర్ 29(భారత శక్తి ): గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి దావతలు, మందు పార్టీల కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఆశావహులు ఖర్చు చేస్తున్నప్పటికీ వారికి డబ్బుల టెన్షన పట్టుకుంది. మూడు విడతల్లో సర్పంచ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత ఎన్నికల అభ్యర్థులకు ఖర్చులు కలిసి వచ్చే అంశం కాగా చివరి విడత వారు అదనంగా భారం మోయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచి 20 రోజుల పాటు ఎన్నికల ప్రచారంతో పాటు క్యాడర్‌ను కాపాడుకునేందుకు వారి కోరికలు తీర్చడం లాంటి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఓటర్లను ప్రభావితం చేసే పెద్దలను, కుల, మహిళా సంఘాలు, యూత లీడర్లను మచ్చిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల ఖర్చుల అంచనా లెక్కలు చూసి ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంత ఖర్చయినా మంచిదే అంటూ డబ్బులు దారబోస్తే గెలువకపోతే ఎలా అనే భయం మరో వైపు కనబడుతోంది. గెలుపు గుర్రాలపై ప్రధాన పార్టీలు ఆరా తీయడంతో పాటు డబ్బులు ఖర్చు చేసే వారిని సంప్రదిస్తున్నారు. నెలన్నర క్రితం విడుదల అయిన స్థానిక ఎన్నికల నోటిఫికేషనతో కూడా కొంత మంది ఆశావహులు డబ్బులు ఖర్చుచేసి రద్దు కావడంతో చేసేదేమీ లేక క్యాడర్‌ను కాపాడుతున్నారు.



6.07 లక్షల మంది ఓటర్లు..

జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు, 3,536 వార్డులు ఉన్నాయి. మొత్తం 6,07,263 మంది ఓటర్లు ఉన్నారు. ఒకటో విడత డిసెంబరు 11న కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, వేములవాడ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో జరుగుతాయి. రెండో విడత జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాలు, చొప్పదండి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో, మూడో విడత ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరగనున్నాయి. ఈనెల 27వ తేదీ నుంచి మొదటి విడత నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఆశావహుకులు ఖర్చులు కూడా మొదలు పెట్టారు.

మూడో విడత డబుల్ ఖర్చులు...

మూడో విడత ఎన్నికలు ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూరు, గొల్లపల్లి, పెగడపల్లి మండలాల్లో జరుగనున్నాయి. మూడో విడతలో ఉన్న మండలాల జీపీల్లో ఆశావహులు ఇప్పటి నుంచి 20 రోజులకు పైగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. మొదటి విడత వారితో పోల్చుకుంటే వారి ఖర్చులు రెట్టింపు కానున్నాయని ఆశావహులు ఆందోళన పడుతున్నారు. ఇప్పటికే కొంత మంది పోటీలో ఉన్నామని బయటపడగా మరికొంత మంది ఖర్చులకు భయపడి బయటకు రావడం లేదు. ఇప్పటికే ఆశవహులు యూత లీడర్లు, వార్డు లీడర్లకు పార్టీలకు అతీతంగా దావతలు, పార్టీల్లో ముంచుతు న్నారు. దీంతో ఖర్చులు తడిపిమోపడవుతున్నాయని తలలు పట్టుకుంటున్నారు.

పరిమితికి మించి....

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు ఎన్నికల కమిషన వ్యయపరిమితి విధించింది. ఐదువేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ. 2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ. 50 వేలు, ఐదు వేల కంటే తక్కువ జనాభా ఉన్న జీపీల్లో సర్పంచులు రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఖర్చులన్నింటిని ఆధారలతో సహా ఈసీకి సమర్పించాలి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై అధికారుల నిఘా ప్రతినిత్యం ఉంటుంది. ఎన్నికల వ్యయానికి ఈసీ విధించిన పరిమితులకు మించి ఎనిమిది నుంచి పది రేట్ల వరకు ఖర్చులు ఉంటాయనేది బహిరంగ రహస్యమే అంటున్నారు.

రిజర్వేషన...స్థానాన్ని బట్టి ఖర్చులు

గ్రామపంచాయతీ రిజర్వేషన్లను బట్టి ఎన్నికల ఖర్చులు మారనున్నాయి. జనరల్, బీసీ స్థానాల్లో ఖర్చు ఎక్కువ ఉండనుండగా, ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో ఒకింత తక్కువ ఖర్చు ఉండనుంది. ఈసారి జనరల్ స్థానాలే ఎక్కువ ఉండటంతో ఆర్థికంగా బలంగా ఉన్నవారు పోటీ పడేందుకు సిద్ధపడుతున్నా రు. ఇప్పటికే పదవులు చేపట్టిన వారితో పాటు కొత్తవారు సైతం పోటీకి సై అంటున్నారు. గత ఎన్నికల్లోనే సర్పంచులుగా గెలిచేందుకు రూ. లక్షల్లో ఖర్చు చేయగా మళ్లీ ఈ ఎన్నికల్లో ఖర్చులు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎన్నికలకు కాసులు ఎట్లా?

పెద్దపల్లి) నవంబర్ 29(భారత శక్తి ):

ఎన్నికల్లో గెలవాలంటే నామినేషన్ వేయాలి.. ప్రచారం చేయాలి. అందుకు కార్యకర్తలు, ప్రచార సామగ్రి తదితరాలు కావాలి. వీటన్నింటి కోసం డబ్బు కావాలి.. అకస్మాత్తుగా వచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌తో పోటీ చేసే అభ్యర్థులు కావాల్సినంత డబ్బు లేక నానా అవస్థలు పడుతున్నారు.

కోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశం తేలేవరకు ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని స్థానిక నేతలు నింపాదిగా ఉండగా, అకస్మాత్తుగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావహులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు డబ్బులు సమకూర్చుకునేది ఎలా అనే ఆలోచనలో పడ్డారు. అప్పులు ఇచ్చే వారి చుట్టూ తిరుగుతున్నారు. కొందరు ఆస్తుల అమ్మకాలకు తెగ బడుతుండగా, మరికొందరు ఆస్తులు కూడబెడుతున్నారు. ఈనెల 25వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మూడు విడతల్లో డిసెంబర్ 11,14, 17 తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 27న విడుదల కాగా, 29వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మొదటివిడతలో కాల్వ శ్రీరాంపూర్, మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని 99గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలతో పాటు 896వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండోవిడతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి మండలంలోని 73గ్రామపంచాయతీలోని సర్పంచ్ స్థానాలకు, 684 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడో విడతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల మండలాల్లోని 91 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలతో పాటు 852వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఈ ఎన్నికల్లో పోటీచేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అభ్యర్థులు ఆశ పడుతున్నారు. గ్రామపంచాయతీల పదవీకాలం 2024జనవరి నెలాఖరుతో ముగియగా మరుసటి నెలలోనే ఎన్నికల నిర్వహించాల్సిన ప్రభుత్వం నిర్వహించలేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలను సకాలంలో నిర్వహించలేకపోయింది. ఇందుకోసం కులగణన సర్వే చేపట్టి బీసీ డెడికేషన్ కమిషన్ ప్రభుత్వం వేసింది. కుల గణన సర్వేకు అసెంబ్లీ ఆమోదం తెలుపగా డెడికేషన్ కమిషన్ సూచన మేరకు బీసీలకు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లులను తీసుకువచ్చి గవర్నర్ ఆమోదానికి పంపించారు. అలాగే ఆర్డినెన్స్‌ను సైతం తీసుకువచ్చారు. ఇవి రాష్ట్రపతి ఆమోదం పొందక పోవడంతో బీసీలకు స్థానిక సంస్థలు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. సెప్టెంబర్ 27వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకేసారి ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది.



డైలమాలో అభ్యర్థులు..

సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రభుత్వం స్థానిక సంస్థలు రిజర్వేషన్లు ప్రకటించిందనీ, ఎన్నికలపై స్టే విధించాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు ఆరు వారాలపాటు స్టే విధించి అఫిడవిట్లో దాఖలు చేయాలని అటు.. ప్రభుత్వాన్ని, ఇటు.. పిటిషనర్లను ఆదేశించింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఒక్కసారిగా డీలా పడ్డారు. ఇప్పట్లో బీసీల రిజర్వేషన్ల అంశం తెగదని భావించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుతో 15వ ఆర్థిక సంఘం గడువు ముగుస్తున్నదని, ఆలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకుంటే రాష్ట్రానికి రావలసిన 3000కోట్ల రూపాయల నిధులు రాకుండా పోతాయని ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలను నిర్వహిస్తున్నది. సెప్టెంబర్‌లో ఇచ్చిన షెడ్యూల్లో మొదట మండల జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించగా, ఇప్పుడు మాత్రం కేవలం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు మాత్రమే షెడ్యూల్ ఇచ్చింది. దీంతో అకస్మాత్తుగా ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసే విషయమై డైలమాలో పడ్డారు.

కనీసం రూ.10లక్షలైనా ఉండాలి..

సర్పంచ్‌గా పోటీ చేయాలంటే కనీసం 10లక్షల రూపాయలైనా ఉండాలి. బీసీ, జనరల్ స్థానాల్లో ఆయా గ్రామ పంచాయతీలను బట్టి 10నుంచి 50లక్షలకు పైగా ఎన్నికల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. నామినేషన్లు వేసిన దగ్గర నుంచి గుర్తులు కేటాయించే వరకు, ఆ తర్వాత పోలింగ్ వరకు వారం రోజుల పాటు ప్రచార నిర్వహించాల్సి ఉంటుంది. ప్రచార ఖర్చులతో పాటు పోల్ మేనేజ్మెంట్ కోసం డబ్బులు అవసరం ఉంటాయి. ఆ డబ్బుల కోసం అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యేలపై ఆశలు పెంచుకోగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు దిక్కులు చూస్తున్నారు.

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం ఖర్చు పెట్టే పరిస్థితిలో ఉన్నట్టుగా కనబడడం లేదు. దీంతో ఆయాపార్టీకి చెందిన ఆశావహులు, అభ్యర్థులు డబ్బుల కోసం ఆస్తులను కొందరు కుదువపెట్టి రుణాలు తీసుకువస్తుండగా, మరికొందరు అమ్మకానికి పెట్టారు. ఏడాదిన్నర కాలంగా గ్రామ ప్రజలు ఎన్నికల్లో పోటీచేయాలని తహతహలాడుతున్నా కొందరు నాయకులు ఈ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకోవాలని చూస్తున్నారు. అప్పులు చేసైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు.

# చెరువులకు ఊపిరి



రంగశాయిపేట నవంబర్ 29(భారత శక్తి ):: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా), వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలో 100 చెరువుల పునరుద్ధరణకు బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది. సాస్కీ(మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సాయం) పథకం ద్వారా తటాకాలు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. ఒక్కో చెరువుకు తొలి విడతలో రూ.25–30 లక్షలు కేటాయిస్తారు. వ్యర్థాలు, పిచ్చిచెట్ల తొలగింపు, ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ హద్దులు, పరిసరాల్లో మొక్కలు నాటడం, లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన నిబంధనల్లో చెరువులు, కుంటలు, పాతకాలం నాటి బావుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించింది.

పాతకాలం నాటి బావుల పునరుద్ధరణకు సైతం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 80–90 బావులు గుర్తించారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాలు, 42 విలీన గ్రామాల్లో పాత బావులు బాగు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బావుల్లో పూడికతీత పనులు, వర్షం నీరు ఇంకే విధంగా రూపొందించారు. స్థానిక కాలనీవాసులకు ఉపయోగపడేలా బావులు బాగు చేయనున్నారు.

## కలిసికట్టుగా పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధిద్దాం

కోరుట్ల నవంబర్ 29(భారత శక్తి ):: కలిసికట్టుగా మందుకు సాగి పం చాయతీ ఎన్నికలో విజయం సాధిద్దామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని సినారే కళా భవ నంలో కోరుట్ల నియోజకవర్గ ఇనచార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి



లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్ని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపి కైన నందయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీకి పునాది లాం టివని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నా మని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ చెర్మన్ శీలం వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, నాయకులు తిరుమల గంగాధర్, గడ్డం వెంకటేష్‌గౌడ్, ఎలే టి మహిపాల్‌రెడ్డి, అన్నం అనిల్, ఆకుల లింగారెడ్డి, ఎంబేరి సత్య నారాయ ణ, ఎడ్ల రమే ష్, గడ్డం కిరణ్, మచ్చ కవిత, శంకర్ పాల్గొన్నారు

## ఎన్నికల ప్రచార ఖర్చులు నమోదు చేయాలి

సిరిసిల్ల, నవంబర్ 29(భారత శక్తి ):: గ్రామపంచాయతీ ఎన్నికల ప్ర చారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శు క్రవా రం గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారంలో భాగంగా చేసే వ్య యం వివరాల నమోదుపై సహాయ వ్యయ పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్య మని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాల ని ఆదేశించారు. ప్రతి సర్పంచ్, వార్డుసభ్యులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ 2.50లక్షలు, 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ 1.50లక్షలని వెల్లడించారు. అలాగే 5వేల కంటే ఎక్కు వ జనాభా ఉన్న గ్రామపంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ 50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 30వేలని తెలిపారు. రూ 50వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లవద్దన్నారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాల ని ఆదేశించారు. శిక్షణలో డీపీవో షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

జగిత్యాల, నవంబర్ 29(భారత శక్తి ):: గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లోని




ఆడిటోరియంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్వోలకు, ఏఆర్వోలకు ఫేజ్– 2 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని వీడియో పవర్ ప్రెజెంటేషన ద్వారా అవగాహన కల్పిస్తూ ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలం టే నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన అంశమని, దీని పైన చాలా కేసులు దాఖలు అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతీఅంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. అధికారిక ప్రకారం మాత్రమే రిజర్వేషన అంశాలను పరిశీలించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత మండల తహసీల్దార్లను సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా సర్పంచ అభ్యర్థికి ఎనిమిది, వార్డు సభ్యులకు ఆరు కంటే ఎక్కువ నామినేషన దాఖలు అయితే తమకు తెలియజేయాలని అన్నారు. అభ్యర్థుల వివరాలు నామినేషన పత్రాల్లో పూర్తిగా నమోదు చేయాలని, లేకుంటే నామినేషనను తిరస్కరించాలని సూచించారు. ప్రతీ చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమవాళికి లోబడి గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా నిర్వహణకు అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషనకు ఒకరోజు ముందుగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన ఒరిజినల్ పత్రాలను సంబంధిత గ్రామ పంచాయతీలలోని ఆర్వోల వద్ద పొందవచ్చని తెలిపారు. జిరాక్స్ కాపీలు వాడవద్దని, వార్డుసభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రొపోజర్ గా ఉండాలని, సర్పంచగా పోటీచేసే అభ్యర్థి డిపాజిట్ కింద కేటగిరి వారీగా చెల్లించాలని, ఏమైనా అప్పీల్ ఉంటే ఆర్డీవోను సంప్రదించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ బి రాజగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన, జనరల్ అబ్జర్వర్ జి. రమేష్, జిల్లా వ్యయ పరిశీలకులు మనోహర్, అడిషనల్ డీఆర్‌డీవో మదన మోహన, డీపీవో రేవంత, జిల్లా నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

సిరిసిల్ల నవంబర్ 29(భారత శక్తి ): సీవీ రామన్ అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ప్రణాళికల ప్రకారం ప్రయోగాలు చేసి ఉన్నత స్థానా లకు ఎదగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా కేంద్రం గీతనగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశా ల విద్యా శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్(ఆర్‌ఎస్‌బీవీపీ)విద్యా వైజ్ఞానిక ప్రద ర్శన–2025 ప్రాజెక్ట్ కాంపిటేషన్‌ను(రెండు రోజులు) ముఖ్య అతిథి ఇన్‌చార్జి కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.



అనంతరం విద్యార్థు లు ప్రారంభోత్సవంలో భాగంగా చేసిన నృత్యాలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను ఇంచార్జి కలెక్టర్, అధికారులు ఆసక్తిగా పరిశీలించా రు. విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్స్‌ను ఎలా తయారు చేశారు...? వాటి వల్ల విని యోగం ఏంటి...? కలిగే ఫలితాలు ఏంటీ...? అని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లా డుతూ విద్యార్థులు తరగ తులలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని ప్రయోగాల ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన వస్తుందన్నా రు. జిల్లాలో సైన్స్ మ్యూజి యం ఏర్పాటు చేయడం కోసం కావాల్సిన స్థలం కోసం ప్రతిపాదనలను పంపాలని విద్యాధికారులను ఆదేశించారు. సైన్స్ పరికాలపై విద్యార్థులకు అవగా హన వచ్చేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామ న్నారు.

## అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 29: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి, విమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (డబ్ల్యూ ఓ ఆర్ డి) ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యం లో అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా కోర్టు సముదాయంనుండి ఒక అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సిహెచ్.వి.ఆర్.ఆర్. వరప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు ఛైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి, అయన మాట్లాడుతూ "మహిళలపై హింస నిర్మూలన కోసం ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ మరియు సమాజం మొత్తం బాధ్యతతో ముందుకు రావాలి. హింసకు గురైన ప్రతి మహిళ న్యాయ సహాయం పొందేలా న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. చట్టపరమైన రక్షణతో పాటు సామాజిక అవగాహన పెరిగినప్పుడే మహిళలపై హింస పూర్తిగా తగ్గుతుంది" అని తెలిపారు. పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.




ఈ ర్యాలీ కార్యక్రమాన్ని కార్యదర్శి ఎమ్.ఎన్.టి. నాగరాణి అందరిని సమన్వయము చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె కార్యక్రమ నిర్వహణలో సక్రమ పర్యవేక్షణ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కామారెడ్డి డాక్టర్ సుమలత, జూనియర్ సివిల్ జడ్జి కామారెడ్డి శ్రీ కె. సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కామారెడ్డి శ్రీమతి దీక్షా, డబ్ల్యూఓ ఆర్ డి మానిటరింగ్ కోఆర్డినేటర్ సోలంకీ రాణి, రమేష్, వారి సిబ్బంది, కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, కామారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డి,డబ్ల్యూ, ఓ సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, కామారెడ్డి టౌన్ సీఐ నరేష్, అడ్వకేట్ శాబానా బేగం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, కామారెడ్డి జిల్లా కోర్టు పరిపాలన అధికారి మంథ్య, సూపరింటెండెంట్లు జే. భుజంగరావు, వెంకట్ రెడ్డి, డిఎల్ఎస్ఎ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, డిఎల్ఎస్ఎ సిబ్బంది, ఎన్జీఓలు, పారా లీగల్ వాలంటీర్లు, కమ్యూనిటీ మిడియేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Tender No. : NW/148/WIII/Tender notice/2025-26, Dated : 27-11-2025**

PUB/1511

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున, క్రింద సంతకం చేసిన వ్యక్తి ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తాడు.

క్రమ సంఖ్య : 1 టెండర్ T-202526-3-085 అథారిటీ కో-ఆర్డర్ టెండర్ విలువ రూ. 5884752.05 లో బిడ్ సెక్యూరిటీ రూ. 117700.00 పూర్తి కాలం పన్నెండు నెలలు పని వివరణ SNSI, MMR, TR, RGO, PSD, KAJG, LSR, POZ, DLB, AWB, MKDD, CTH, KMV & NSL: ADEN/AWB విభాగంలో ఒక సంవత్సరం పాటు రైల్వే OH ట్యాంకుల్లోకి పంపింగ్ చేయడంతో సహా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రోడ్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా మరియు రవాణా. టెండర్ ఫారమ్‌ధర రూ.0

క్రమ సంఖ్య : 2 టెండర్ నం T-202526-3-086 అథారిటీ కో-ఆర్డర్ టెండర్ విలువ రూ. 70797085.18 రూ.లలో బిడ్ సెక్యూరిటీ రూ. 504000.00 గడువు: 12 నెలలు (పన్నెండు నెలలు) పని వివరణ SW-I-మన్మాడ్-ముద్ఖేడ్ (UP/DN) - సెస్ రిపేర్ 86700 కమ్ & అకోలా - పూర్ణ - సెస్ రిపేర్ - 40000 కమ్ (IRPSM ID-11.0.31.24.3.53.010 -2024-25 ఆర్థిక సంవత్సరం యొక్క పిబి నం. 157) SW-II నాందేడ్ డివిజన్ - మన్మాడ్-ముద్ఖేడ్ (UP& SL) విభాగం: Exg యొక్క CTR(P). PSC6 స్లీపర్‌లపై 60 kg/90UTS పట్టాలు 1660 Nos/km% సాంద్రత కొత్త 60Kg తో కొత్త వెడల్పుపై R260 గ్రేడ్ పట్టాలు (LWR) PSC స్లీపర్లు 1660 సంఖ్యలు/కి.మీ.తో సహా బ్యాలస్ట్ పునరుద్ధరణ మరియు పెరుగుదల 35 సెం.మీ. వరకు కుషన్ మరియు లోతైన స్క్రీనింగ్ మొత్తం పొడవు 15.317 బ్యాలస్ట్ యొక్క కి.మీ. (మంజూరైన ప్రదేశాలు ఈ విధంగా జతచేయబడ్డాయి అనుబంధం) (ప్రాజెక్ట్ ID : 11.04.31.24.3.53.002 & పిబి ఐటెమ్ నం. 2024-25లో 155) (బ్యాలెన్స్ సెస్ వర్క్) టెండర్ ఫారం ధర రూ. 0 లో

క్రమ సంఖ్య : 3 టెండర్ నం T-202526-3-087 అథారిటీ కో-ఆర్డర్ టెండర్ విలువ రూ. 9904305.01 లో సంపాదించిన డబ్బు రూ. 198100.00 పూర్తి వ్యవధి ఆరు నెలలు పని వివరణ సీనియర్ DEN/W/NED విభాగంలోని మనుషులతో కూడిన LC లకు మెరుగైన సౌకర్యాల ఏర్పాటు. టెండర్‌ఫారమ్ ధర రూ. 0

క్రమ సంఖ్య : 4 టెండర్ నం T-202526-3-088 అథారిటీ కో-ఆర్డర్ టెండర్ విలువ రూ. 19662333.45 రూ.లలో సంపాదించిన డబ్బు. 248300.00 పూర్తి కాలం తొమ్మిది నెలలు పని వివరణ SW-I-నాందేడ్ డివిజన్-మన్మాడ్-ముద్ఖేడ్ (DN&SL)-TRR(P)-11.837 Tkm. (మంజూరు చేయబడిన ప్రదేశాలు ఈ విధంగా జతచేయబడ్డాయి అనుబంధం) (IRPSM ID : 11.04.31.25.3.53.013 & 2025 నాటి PWP-26) SW-II%-నాందేడ్ డివిజన్-PRLI-PBN (SL)-TRR(P)- 4.10Tkm.(మంజూరు చేయబడిన ప్రదేశాలు (ఇలా జతచేయబడ్డాయి అనుబంధం) (IRPSM ID : 11.04.31.25.3.53.014 & 2025 నాటి PWP- 26).SW-III-నాందేడ్ డివిజన్ - నాందేడ్ డివిజన్ -అకోలా -పూర్ణ (SL) TRR(P) -4.00 Tkm. (మంజూరు చేయబడిన ప్రదేశాలు అనుబంధంగా జతచేయబడింది) (IRPSM ID : 11.04.31.25.3.53.016 & 2025 నాటి PWP- 26). SW-IV-నాండెడ్ డివిజన్ మన్మాడ్ ముద్ఖేడ్ (SL) - TRR(P) - 1.8300 Tkm. (మంజూరు చేయబడిన ప్రదేశాలు అనుబంధంగా జత చేయబడింది) (IRPSM ID : 11.04.31.24.4.53.003 & LSWP యొక్క 2024-25). మొత్తం TRR(P): 21.767 కి.మీ. undr DEN/W/NED యొక్క అధికార పరిధి. టెండర్ ఫారం ధర రూ. 0

క్రమ సంఖ్య : 1 టెండర్ నం. T-202526-3-085 ఒకే రకమైన పని (రూ. 50 లక్షలకు పైగా ఖర్చు అయ్యే) ఏదైనా సివిల్ ఇంజనీరింగ్ పనులు (ట్రాక్ పనులు/జోనల్ పనులు మినహాయించి).

క్రమ సంఖ్య : 2 టెండర్ నం. T-202526-3-086 ఒకే రకమైన పని (రూ. 50 లక్షల కంటే ఎక్కువ ఖర్చుతో కూడిన పనికి) జోనల్ పనులు మినహా ఏదైనా సివిల్ ఇంజనీరింగ్ పని.

క్రమ సంఖ్య : 3 టెండర్ నం. T-202526-3-087 ఒకే రకమైన పని (రూ. 50 లక్షలకు పైగా ఖర్చు అయ్యే పనులకు) ఏదైనా సివిల్ ఇంజనీరింగ్ పనులు (ట్రాక్ పనులు / జోనల్ పనులు మినహాయించి)

క్రమ సంఖ్య : 4 టెండర్ నం. T-202526-3-088 ఒకే రకమైన పని (రూ. 50 లక్షలకు పైగా ఖర్చుతో కూడిన పనికి) ట్రాక్ నిర్వహణ పనితో సహా ఏదైనా రైల్వే ట్రాక్ పని.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క దిద్దుబాటు పత్రాలు, ఏదైనా ఉంటే, ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

ముగింపు తేదీ & సమయం: 21.12.2025 3.00 గంటలకు.

Sr.DEN/Co-ord/NED



**Tender Notice No. : 48/2025, Dated : 28-11-2025**

PUB/1512

స్టోర్ వస్తువుల సరఫరా. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు: కింది టెండర్లు ఆన్‌లైన్‌లో దాఖలు చేయబడ్డాయి. టెండర్లు www.Ireps.Gov.In వెబ్‌సైట్‌ను సందర్శించి వారి ఆఫర్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించబడింది. టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్‌లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్‌లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి 14.30 గంటలు. "అన్ని స్వదేశీ ఆఫర్‌ల కోసం, www.ireps.gov.inలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే EMD అంగీకరించబడుతుంది."

| టెండర్ నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| LN257082 | మొబైల్ ఛార్జింగ్ సాకెట్ |
| 29251425 | స్టాండర్డ్ జర్నల్ డయా కోసం రేసర్ల సెట్ |
| 56251003 | లెడ్ యాసిడ్ స్టేషనరీ బ్యాటరీ 48 v, 200 AH |
| 38255020 | స్థిరమైన కాంటాక్ట్ సైడ్ బేరర్ అసెంబ్లీ |
| LN255552A | SS అగ్నిమాపక యంత్రాలు |
| 46251017 | 60kva ట్రాన్స్‌ఫార్మర్ కాంట్రాక్టర్ |
| 6025PT033 | వెల్డింగ్ భాగంలో స్పెసిఫికేషన్ నెం. IRST/19-2021-52kg (90UTS%) ప్రకారం |
| LH256886 | ఎయిర్ కంప్రెసర్ మోటార్ కంప్రెసర్ (AGTU) (FTIL) |
| 33251551 | LHB కోచ్‌ల WSP వ్యవస్థ కోసం సర్క్యూట్ బోర్డ్ EB01B |
| 33251612 | LHB కోచ్‌ల WSP వ్యవస్థ కోసం సర్క్యూట్ బోర్డ్ MBO4 |
| 90251156 | M.S. ఫ్లాట్స్ స్టీల్ సైజు 40 x 60 mm TOIS; 2062/2006 స్పెసిఫికేషన్ E250 గ్రేడ్ A పొడవు 6 మీటర్లు. |
| 56251190A | ఎరుపు, ఆకుపచ్చ, పసుపు రంగు, ప్రధాన LED సిగ్నల్ లైటింగ్ |
| 29251604 | స్థూపాకార రోలర్ బేరింగ్ పూర్తి |
| 30251020 | సైడ్ బఫర్ రీకోయిల్ స్ప్రింగ్ (BG) |
| 30251301 | BG కోచ్‌ల యాంకర్ లింక్ కోసం సైలెంట్ బ్లాక్ |
| SCR-25-CAP-UTV | UTV లేదా IR ట్రాక్ యంత్రాల కోసం మూలధన విడిభాగాల ట్రాన్స్‌మిషన్ గేర్ బాక్స్ సరఫరా కోసం రేటు ఒప్పందం |
| 38251007A | 22.22 మిమీ వ్యాసం కలిగిన లాక్ బోల్ట్ |
| LY255174A | మైక్రో ప్రాసెసర్ ఆధారిత ఎలక్ట్రానిక్ వేగాన్ని సూచించే కమ్ రికార్డింగ్ మరియు శక్తి పర్యవేక్షణ వ్యవస్థ RDSO స్పెసిఫికేషన్ నం.RDSO/PE/SPEC/ EMU/0032-2002 |
| LY255819 | స్టెయిన్‌లెస్ స్టీల్ 3 సీటర్ కుర్చీ సరఫరా మరియు సంస్థాపన (డ్రాయింగ్ కాపీ జత చేయబడింది) |
| 66259088 | ట్రాక్ మెషిన్ కోసం కవాటాలు మరియు పంపుల సేకరణ |
| 66259185 | ప్లాసర్ తయారీ ట్రాక్ మెషిన్ విడిభాగాలు |

**గమనిక : టెండర్ ప్రారంభ గడువు తేదీలు**
తేదీ 15.12.2025న క్రమ సంఖ్య 01 నుండి 04 వరకు. తేదీ 16.12.2025న క్రమ సంఖ్య 05 నుండి 07 వరకు. తేదీ 17.12.2025న క్రమ సంఖ్య: 08 & 09 వరకు. తేదీ 18.12.2025న క్రమ సంఖ్య.10 నుండి 12 వరకు. తేదీ 22.12.2025న క్రమ సంఖ్య.13 నుండి 15 వరకు తేదీ .23.12.2025న క్రమ సంఖ్య.16 & 17 వరకు. తేదీ 24.12.2025న క్రమ సంఖ్య.18 & 19 వరకు. తేదీ 29.12.2025న క్రమ సంఖ్య.20. క్రమ సంఖ్య .21 వరకు తేదీ 05.01.2026న

పైన పేర్కొన్న టెండర్లతో పాటు రూ. 50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు ఉన్నాయి. వివరాల కోసం దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ / SCR / సికింద్రాబాద్

A1918

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి



# దేవుడి భూములు.. అక్రమార్కుల పాలు

జఫర్‌గఢ్, నవంబర్ 29(భారత శక్తి ):స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో దశాబ్దాల కిందట దేవుడిపై ఉన్న భక్తితో అనేకమంది దాతలు తమకు ఉన్న వ్యవసాయ భూములను భగవంతుడి పేర పట్టా చేశారు. ఈ భూములను పరిరక్షించే వారు లేకపోవడంతో కబ్జాలకు గురవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

జఫర్‌గఢ్ మండలం ఓబులాపూర్‌లో దాతలు సర్వే నం. 93లో 4-03 ఎకరాల భూమిని దేవుని పేర పట్టా చేశారు. ఈ భూమిలో పండిన పంట గింజలను అర్చకుల భృతి కింద ఇవ్వాలని పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం. గ్రామాల్లో పూజలు చేస్తే ఉపాధి కరవు కావడంతో ముగ్గురు పూజారులు కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లారు. అక్రమార్కుల కన్ను పడడంతో ఈ భూమి 1-05 ఎకరాలకే పరిమితమైంది. దేవుని భూమిని విక్రయిస్తే నేరమని తెలిసి కూడా కొందరు రాజకీయ నాయకులు.. మీ పేర చేయిస్తామని చాలామంది వద్ద డబ్బులు దండుకున్నారు. ప్రస్తుతం ఎకరం దాదాపు రూ. 20 లక్షల ధర పలుకుతోంది. తిమ్మంపేటలో 348 సర్వే.నెంబర్ 28 గుంటల దేవుడి భూమి ఉంది. ఇందులో కొంత కబ్జాల పాలైంది. మల్లికార్జునస్వామి ఆలయంలో 5 ఎకరాల భూమి ఉంది. అందులో కొందరు కబ్జాకోరులు కోళ్ల ఫారం నిర్మింపజేసి.. ఈ భూమిని ఇతరులకు విక్రయించే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు ఫారం షెడ్డును తాళం వేశారు.

రూ. 2 కోట్ల భూమి అన్యాక్రాంతం..

రఘునాథపల్లిలో మహదేవస్వామి ఆలయానికి చెందిన ఆరు ఎకరాల స్థలాన్ని రాజకీయ పార్టీల నేతల కబంధహస్తాల్లో చిక్కుకుంది. ఈ భూమిని రక్షించాలని అనేక మార్లు ప్రజా సంఘాలు ఆందోళన చేసినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దాదాపు రూ. 2 కోట్ల భూమిని అన్యాక్రాంతమయిందని గ్రామస్థులు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తాటికొండ, ఇప్పగూడెం, చిల్పూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతమౌతున్న సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

దేవాదాయ భూములను ఎవరైనా అక్రమిస్తే చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటాం. భూములను కొనుగోలు చేసిన వారి పేర పట్టాలు కావు. దేవాదాయ శాఖతో కలిసి భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం.

# పంచాయతీ బరిలో మాజీ మావోయిస్టు

సిరిసిల్ల నవంబర్ 29(భారత శక్తి ): మావోయిస్టు పార్టీలో అగ్రనేతల నుంచి కిందిస్థాయి క్యాడర్ వరకు దశల వారీగా లొంగిపోతున్నారు. ఇటీవలి కాలంలో ఈ పరంపర కొనసాగుతోంది. అలా రెండేళ్ల క్రితం లొంగిపోయిన మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి సర్పంచిగా పోటీ చేసేందుకు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగలపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి 2005లో దళ సభ్యురాలిగా చేరారు. కోనరావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2001లో పదో తరగతి చదివిన జ్యోతి.. 18 ఏళ్ల ప్రస్థానంలో జిల్లా కమిటీ సభ్యురాలి



స్థాయికి చేరారు. రాష్ట్ర ప్రెస్ ఇన్‌ఛార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2023లో అనారోగ్య కారణాలతో పార్టీ నుంచి బయటకు వచ్చారు. పోలీసులకు లొంగిపోయాక ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్నారు. ఇటీవల రిజర్వేషన్లలో శివంగలపల్లి సర్పంచి బీసీ మహిళకు కేటాయించారు. ప్రజాసేవ చేసే అవకాశం కోసం సర్పంచి పోటీలో నిలబడినట్లు జ్యోతి తెలిపారు.

# కాసులిస్తేనే దస్త్రాలు కదిలేది

మల్యాల తహసీల్దారు కార్యాలయంలో చేతులు తడపనిదే పనులు కావడం లేదన్న విమర్శలున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మొదలు పహాణీలు, విరాసత్, నాలా మార్పిడి తదితర పనులు జరగాలంటే డబ్బులివ్వాల్సిందేనని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు చెప్పిందే వేదంగా మారింది. రిజిస్ట్రేషన్ సమయంలో కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తిప్పుకొని బేరం కుదరగానే పని చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏ పనికి ఎన్ని రోజులు పడుతుందో తెలిపే సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. పలు గ్రామాల పరిధిలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఆరోపణలున్నా పరిరక్షణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# ఎన్నికల ప్రచార ఖర్చులు నమోదు చేయాలి

సిరిసిల్ల, నవంబర్ 29(భారత శక్తి ):: గ్రామపంచాయతీ ఎన్నికల ప్ర చారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా



నమోదు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారంలో భాగంగా చేసే వ్య యం వివరాల నమోదుపై సహాయ వ్యయ పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాల ని ఆదేశించారు. ప్రతి సర్పంచ్, వార్డుసభ్యులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ 2.50లక్షలు, 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ 1.50లక్షలని వెల్లడించారు. అలాగే 5వేల కంటే ఎక్కు వ జనాభా ఉన్న గ్రామపంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ 50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ.30వేలని తెలిపారు. రూ 50వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లవద్దన్నారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాల ని ఆదేశించారు. శిక్షణలో డీపీవో షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



# దుంగలు దొరికినా.. దొంగలు చిక్కరు

వెంకటాపురం, నవంబర్ 29(భారత శక్తి ): అడవుల ఖిల్లాగా పేరొందిన ములుగు జిల్లా కలప దందాకు అడ్డాగా మారింది. నిశీధిలో అక్రమార్కుల ధనదాహానికి పచ్చదనం హరించుకుపోతోంది. మన అడవుల్లోని జిట్రేగు కలప గుట్టుగా అక్రమ మార్గంలో సాగుతోంది. అడపాదడపా దుంగలు చిక్కిన పెద్ద దొంగల జాడలో 'గుట్టు' నెలకొంది. చీకటి మాటున యథేచ్ఛగా జరుగుతున్న కలప దోపిడీపై కథనం..

కన్నేస్తూ.. కళ్లుగప్పి తరలిస్తూ..

జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నాణ్యమైన టేకుపై కన్నేశారు. ఊసూరు బ్లాక్ పరిధిలోని భీమారం, కొత్తపల్లి కీంకారణ్యంలో వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. కన్నాయిగూడెం, ములుగు మండలాల్లో జిట్రేగు కలప అక్రమాలు వెలుగుచూశాయి. భారీ దుంగలను ట్రాక్టర్ల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. తక్కువ ధరకే కలపను చేజిక్కించుకుని ముఠాల నీడలో అక్రమ పంథాను అనుసరిస్తున్నారు. సినిమాను తలదన్నేలా దందా జోరుగా సాగిస్తున్నారు.

వెంకటాపురం అటవీ డివిజన్‌లోని భద్రాచలం-చంద్రుపట్ల ఆర్అండ్‌బీ రహదారి నుంచి హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ మార్గానికి చేర్చుతున్నారు. నిఘాను పసిగట్టేందుకు ముందుగా ద్విచక్ర వాహనాలపై ఎస్కార్టుగా వస్తూ ఎవరూ లేకుంటే కలప వాహనాలను విజయవాడ, రాజమండ్రి, మణుగూరు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. వెంకటాపురం మండలం ఎదిరలోని టేకు దుంగలను గోదావరి దాటిస్తున్నారు. కొన్నాళ్లుగా దూరంగా ఉన్న అక్రమార్కులు జిట్రేగుకు డిమాండ్ ఉండటంతో రెచ్చిపోతున్నారు. అటవీశాఖ అధికారులు సమాచారం వస్తేనే తనిఖీలు చేపడుతున్నారు. వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, ములుగు ప్రాంతాల్లో ఈ ఏడాది దాదాపు రూ.40 లక్షల విలువైన కలపను పట్టుకున్నట్లు లెక్కల్లో ఉంది. 15కు పైగా ఘటనల్లో దుంగలు దొరికినా.. దొంగలు చిక్కకపోవడం గమనార్హం. పదికి పైగా వాహనాలను పట్టుకున్నారు.

కలప స్మగ్లింగ్‌పై నిఘాను తీవ్రం చేశాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నాం. ఇతర ప్రాంతాల నుంచి తరలివెళ్లే కలపపై కన్నేశాం. అక్రమార్కుల సమాచారం లాగేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# అటవీ రక్షణకు సాంకేతిక దన్ను..

కొత్తగూడ, నవంబర్ 29(భారత శక్తి ): అటవీ సంపద పరిరక్షణకు సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకున్నారు.. ఈమేరకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇస్రో సహకారంతో ప్రత్యేక సాంకేతికతో అంతరిక్షం నుంచి పరిశీలించేలా ప్రత్యేక విధానాన్ని అధికారులు అమలు చేశారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) ద్వారా ఎక్కడ ఎంత విస్తీర్ణం ఉందనే లెక్కించేలా నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. దట్టమైన అడవుల్లో తగ్గుతున్న పచ్చదనం, చెట్ల నరికివేతపై కొత్త విధానంతో ఐదు రోజుల్లోగా పూర్తిస్థాయి సమాచారాన్ని అందజేస్తుంది. ఇప్పటి వరకు ఉపగ్రహ చిత్రాలు, నివేదికలు రూపొందించడానికి తొమ్మిది నెలల సమయం పట్టేది. ఈ విధానంతో తక్షణమే చర్యలు చేపట్టడంతో అడవుల రక్షణ పెరగనుంది.



అడవుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్ తెలిపారు. కొత్త సాంకేతిక విధానంతో అటవీ రక్షణ చర్యలు మరింత సులువుగా మారాయన్నారు.

చెట్లను స్మగ్లర్లు, పోడుదారుల నుంచి కాపాడేందుకు సిబ్బంది పర్యవేక్షణతోపాటు అడవుల్లో సీసీ కెమెరాలు, ట్రాప్‌కెమెరాలను నెలకొల్పారు. సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాలను అడవుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేయించారు. నీటి వసతి ప్రాంతాలు, జంతువులు ఎక్కువ సంచరించే ప్రాంతాల్లో ట్రాప్‌కెమెరాలను నెలకొల్పారు. వీటి ఆధారంగానే ఇటీవల జిల్లా అడవుల్లోకి తరచూ వస్తున్న పులి సేద తీరిన ప్రాంతాలను గుర్తించారు.

జనవరి నుంచి అడవుల్లో జరిగే వన్యప్రాణుల సెన్సెస్ సైతం ఈసారి కొత్త పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈమేరకు కొంతమంది సిబ్బందికి ప్రత్యేక సాంకేతిక విధాన ప్రత్యేక యాప్, కెమెరాలతో ఈ సెన్సెన్‌ను నిర్వహించేందుకు శిక్షణ ఇస్తున్నారు. గతంలో అడవుల్లోని నీటి స్థావరాల ప్రాంతాల్లో లభించే వన్యప్రాణుల పాదముద్రలు, వాగులు, ఇసుక మేట్లపై ఏర్పడిన పాదముద్రల పరిశీలనతో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి వన్యప్రాణులు జీవిస్తున్నాయనేది సెన్సెస్ చేసేవారు. ఈ సెన్సెస్ నిర్వహించే రోజుల్లో బయటకు రాకుండా ఉన్న జంతువులను సైతం గుర్తించేలా ప్రత్యేక యాప్ ద్వారా కెమెరాలతో వన్యప్రాణుల సంఖ్యను లెక్కిస్తారు. ఇందుకోసం ఆదిలాబాద్ జిల్లా కవ్వాల ప్రాంతానికి చెందిన ఓ ప్రత్యేకాధికారి ఉమ్మడి వరంగల్ అటవీశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



# గూడు కట్టరు.. గోడు పట్టదు

నెక్కొండ, నవంబర్ 29(భారత శక్తి ): గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పంచాయతీలను ఏర్పాటు చేసింది. నర్సంపేట నియోజకవర్గంలో పలు పంచాయతీలకు గూడు కరవైంది. పలు పంచాయతీ కార్యాలయాలను అద్దె భవనాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఈ భవనాల్లో కనీస సౌకర్యాలు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు పాత పంచాయతీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో భవనాలు కురుస్తున్నాయి. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన 76 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా సొంత భవనాల ఏర్పాటుపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామ పాలనకు ఆటంకం

అద్దె భవనాల్లో కొనసాగుతున్న కొత్త పంచాయతీల్లో విధుల నిర్వహణకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సభలు, పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. రికార్డుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. కొన్ని తండాల్లో పాఠశాలల గదుల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. వీటిలో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. శిథిల భవనాల్లో పని చేయడం కష్టంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు పారదర్శకంగా నిధులు అందజేస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. కొత్త పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామ పాలన సక్రమంగా సాగడం లేదు. ప్రతి పంచాయతీలో భవనాలు నిర్మించి పారదర్శక పాలన అందించాలి.

# ఆగని పోడు.. వినరే గోడు

భూపాలపల్లి, నవంబర్ 29(భారత శక్తి ): మహాముత్తారం, అటవీ భూముల్లో పోడు హెచ్చుమీరుతోంది. అధికారులకు తెలిసినా.. పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఏటేటా అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. జిల్లాలోని పలిమెల, ఆజంనగర్, దూదేకులపల్లి, పెగడపెల్లి, అటవీ రేంజిలో పలు మారుమూల అటవీ గ్రామాల్లోని సమీప అడవుల్లో పోడు అధికంగా ఉంది.

వేలాది ఎకరాలు..

ఇప్పటికే దూదేకులపల్లి, నందిగామ శివారు పందిపంపుల, సింగారం ప్రాంతాల్లో గొత్తికోయల గుడిసెల ప్రాంతంలో వేలాది ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఈ మేరకు పెగడపెల్లి, పలిమెల, ఆజంనగర్ అటవీ రేంజిల పరిధిలోని పలు అటవీ గ్రామాల సమీప అడవుల్లో విలువైన చెట్లు నేలమట్టమయ్యాయి. తాజాగా పలిమెల, ఆజంనగర్ రేంజిలోని లెంకలగడ్డ, మహాముత్తారం అడవుల్లో అక్రమార్కులు అడవులను చెరపడుతున్నారు. ఇక్కడ పనిచేసిన గతంలో కొంతమంది అధికారులు, సిబ్బంది సహకారంతోనే అడవులను నరికి భూములను అమ్ముకున్నా.. వారిపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు.

ఈ ప్రాంతాల్లో చెట్లు నరికివేతకు గురైన ప్రదేశాన్ని అటవీ సిబ్బంది పరిశీలించి, కొంతమందిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలోని ఓ అటవీ గ్రామానికి చెందిన ఒకరు ట్రాక్టరుతో పోడు పేరుతో అడవుని చదును చేస్తుండగా.. అటవీ అధికారులు పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తి అధికారులను గతంలో బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది.

అటవీ ఉద్యోగులకు తెలిసినా..

అడవులను నరికివేతకు పాల్పడిన సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని వ్యక్తులను కోర్టులో హాజరుపరచాలి. ఎంత విస్తీర్ణంలో నష్టం జరిగిందనే ప్రాథమిక విచారణ అనంతరం పీవోఆర్ చేయాలి. ఇటీవల జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అడవుల నరికివేత కొంతమంది వలసదారులతో వృక్షాలను రాత్రి పూట నేలమట్టం చేయించి డోజర్ ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తున్నారు. ఇదంతా అటవీ ఉద్యోగులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

విచారించి చర్యలు తీసుకుంటాం.

జిల్లాలోని అటవీ రేంజిల పరిధిలో క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంలో ఎవరికైనా అటవీ ఉద్యోగులకు సంబంధం ఉన్నట్లు విచారణలో తేలితే వారిపైన చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

# ధర్మపురిలో పూర్తిస్థాయి డంపింగ్ యార్డు ఏర్పాటుకు కృషి: మంత్రి

ధర్మపురి నవంబర్ 29(భారత శక్తి ):: ధర్మపురి పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకపోవడంతో నదీ తీరమంతా చెత్తాచెదారంతో నిండిపోతోందని ప్రజలు, నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం గోదావరి నదీ తీర ప్రాంతాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సమావేశం నిర్వహించి ధర్మపురి పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని తెలిపారు. రానున్న పుష్కరాల లోపు ధర్మపురిని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు.



# గడువు దాటితే గుబిల్లు

, భానుపురి నవంబర్ 29(భారత శక్తి ): ఒక్క నెలే కదా..తర్వాత చూసుకుందామని విద్యుత్తు బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారా..? అయితే జరిమానా చెల్లించక తప్పదు. రీడింగ్ తీసిన సమయంలోనే బిల్లుపై చెల్లింపు గడువు తేదీ ఉంటుంది.

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రీడింగ్ తీస్తారు.

ఏరోజైతే బిల్లు ఇస్తారో, అప్పటి నుంచి 15 రోజుల్లోపు బిల్లు చెల్లించాలి.

ఒకవేళ గడువు లోపు చెల్లించకుంటే కనెక్షన్‌ను బట్టి రూ.25, రూ.150 వరకు జరిమానా విధిస్తారు. కేటగిరీ వారీగా తర్వాత



బిల్లులో ఆటోమేటిక్‌గా జనరేట్ అవుతుంది.

రెండు నెలలైనా బిల్లు చెల్లించకుంటే మరో 15 రోజుల సమయం ఇచ్చి, కరెంట్ సరఫరా నిలిపివేస్తారు.

కనెక్షన్ తొలగింపు ఛార్జి రూ.75 కూడా వినియోగదారుడే భరించాలి.

ఏదైనా సమస్య ఉంటే వినియోగదారులు '1912' టోల్ ఫ్రీని సంప్రదించాలి.

# ఖర్చులకు పైసలెట్లా..

నాంపల్లి, పంచాయతీ ఎన్నికల పోరు మొదలైంది. మొదటి విడతకు సంబంధించి సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు నామపత్రాలు స్వీకరిస్తున్నారు. రెండు, మూడో విడతల్లో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో ఆశావహులు పోటీకి సమాయత్తమవుతున్నారు. పల్లెపోరు పార్టీలకు అతీతంగా జరుగుతున్నప్పటికీ..ఆయా పార్టీల నేతల హడావుడి భారీగానే ఉంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో స్థానిక నాయకులు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి డబ్బులు ఖర్చు చేశారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో తమవంతు రాగానే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఖర్చును భరించేది ఎలా అని సర్పంచి అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

భారీగా పెరిగిన అంచనాలు..

సర్పంచిగా పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు చిన్న గ్రామాల్లో కనీసం రూ.25 లక్షలు, పెద్ద గ్రామాల్లో రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులున్నాయి. మండల కేంద్రాలు, నగరాలు, పట్టణాలకు దగ్గరగా ఉన్న పంచాయతీల్లో రూ.కోటి వరకు ఖర్చు తప్పదని ఆశావహులే పేర్కొంటున్నారు. ఇటీవల అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల చూపిన బాటలోనే ప్రస్తుతం ఓటర్లు నడిచే అవకాశముందనే చర్చ గ్రామాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలంటే ఎంత ఖర్చు చేయాలోనని అభ్యర్థులు వాపోతున్నారు.

మొదటి విడతలో పోటీచేసే పంచాయతీల్లో అభ్యర్థులకు గడువు దగ్గరలోనే ఉండటంతో కాస్త వ్యయం తక్కువగానే ఉండే అవకాశముంది. రెండు, మూడు విడతల్లో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో పోటీచేసే వారికి వ్యయం తడిసి మోపడయ్యేలా ఉందని పోటీచేసే నాయకులు ఆందోళన చెందుతున్నారు.

# ఏకగ్రీవమా.. సమరమా?

ఖమ్మం: గ్రామపంచాయతీ ఎన్నికల వేడి క్రమేణా పెరుగుతోంది. పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయటానికి కొన్ని గ్రామాల్లో అభ్యర్థులు సన్నద్ధమవుతుండగా.. ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకునేందుకు మరికొన్నిచోట్ల నాయకులు పావులు కదుపుతున్నారు. ఆలయాల నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలంటూ బహిరంగ వేలం వేస్తున్నారు.

కామేపల్లి మండలం జోగ్గుడెంలో అభయాంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి పంచాయతీ ఎన్నికలను వేదికగా చేసుకున్నారు. ఈగ్రామంలో రెండో విడత ఎన్నికలు జరగాల్సి ఉండగా.. సర్పంచి పదవికి బహిరంగ వేలంపాటను శుక్రవారం నిర్వహించారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. రూ.20 లక్షలకు సర్పంచి పదవిని ఓ వ్యక్తికి కట్టబెట్టేందుకు స్థానికులు తీర్మానించారు.

మధిర మండలం దేశినేనిపాలెంలోనూ కొందరు ఈదిశగా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

రఘునాథపాలెం మండలంలో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.10లక్షల చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ హామీ ప్రభావం తేలాలంటే తొలిదశ నామినేషన్ల ఉపసంహరణ గడువు వరకు వేచిచూడాల్సిందే. ప్రస్తుతం రఘునాథపాలెం మండలంలోని ఓ గ్రామంలో చర్చలు సాగుతున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లో పోటాపోటీ..

అధికార పార్టీ మద్దతుతో బరిలో నిలవాలనుకునేవారి సంఖ్య అధికంగా ఉంది. క్షేత్రస్థాయిలో ఆశావహులు ఎందరున్నారు, ఎన్నికల పోటీని తట్టుకునే శక్తి ఎవరికి ఉందనే వివరాలు తెలుసుకునేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులతో సమన్వయ కమిటీలను పార్టీ ముఖ్యనాయకులు ఏర్పాటుచేశారు. ఆయా కమిటీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు సేకరిస్తున్నారు. గెలుపు గుర్రాలెవరో ఆరాతీస్తున్నారు. పోటీదారులు ఎక్కువగా ఉండటంతో ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నారు. రఘునాథపాలెం మండలంలో సర్పంచి అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని నాయకులకు మంత్రి తుమ్మల అప్పగించారు.

# కాసులిస్తేనే దస్త్రాలు కదిలేది

మల్యాల నవంబర్ 29(భారత శక్తి ):మల్యాల తహసీల్దారు కార్యాలయంలో చేతులు తడపనిదే పనులు కావడం లేదన్న విమర్శలున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మొదలు పహాణీలు, విరాసత్, నాలా మార్పిడి తదితర పనులు జరగాలంటే డబ్బులివ్వాల్సిందేనని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు చెప్పిందే వేదంగా మారింది. రిజిస్ట్రేషన్ సమయంలో కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తిప్పుకొని బేరం కుదరగానే పని చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏ పనికి ఎన్ని రోజులు పడుతుందో తెలిపే సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. పలు గ్రామాల పరిధిలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఆరోపణలున్నా పరిరక్షణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పహాణీనే మార్చేశారు

సర్వాపూర్-తాటిపల్లి శివారులో ఇద్దరు రైతుల పేరిట ఉన్న భూమికి సంబంధించిన పహాణీలో మరో వ్యక్తి పేరును కార్యాలయంలో పని చేసే ఓ అధికారి ఇరికించి మార్చినట్లు(ట్యాంపరింగ్) తెలిసింది. అధికారుల తీరును యజమానులు ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. భూమి లేని వ్యక్తి పేరుతో పహాణీ జారీ చేయడం వివాదాస్పదమైంది.

మ్యాడంపల్లికి చెందిన రైతు తన తండ్రి పేరిట ఉన్న వ్యవసాయ భూమిని విరాసత్ చేయించుకోవడానికి వస్తే అధికారులు మూడు నెలల పాటు తిప్పుకున్నారు. చివరికి ఓ మధ్యవర్తి ద్వారా భారీ మొత్తంలో ముట్టజెబితే పని చేసినట్లు సమాచారం.

కొన్ని సందర్భాల్లో డబ్బును కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగికి యూపీఐ ద్వారా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఏడాది కిందట ఓ రైతు నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేయడం అప్పట్లో తీవ్ర వివాదానికి దారి తీసింది.

పోతారం శివారులోని ప్రభుత్వ భూమిని తన పేరిట మార్చుకోవడానికి ఓ వ్యక్తి అధికారులను ఆశ్రయిస్తే రూ.లక్ష వరకు డిమాండు చేసినట్లు సమాచారం. బేరం కుదరకపోవడంతో దస్త్రాన్ని హోల్డ్‌లో పెట్టినట్లు ప్రచారం సాగుతోంది.

వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేయించడానికి అధికారుల పేరు చెప్పి దళారులు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

రైతులు సొంత భూమిని తమ అవసరాల మేరకు వ్యవసాయేతర(నాలా) భూమిగా మార్చుకోవడానికి చలానా ద్వారా రుసుం చెల్లించినా అధికారులు కొర్రీలు పెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వారం రోజుల కిందట మల్యాలకు చెందిన ఓ రైతు ఇంటి నిర్మాణ నిమిత్తం నాలా మార్పిడి కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

భూముల రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు వసూలు చేయడం లేదు. ఎవరైనా వసూలు చేసినా మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. అనుమానం కలిగితేనే భూమిని పరిశీలించి నిర్ధారించుకున్నాకే రిజిస్ట్రేషన్, విరాసత్ అమలు చేస్తున్నాం. పహాణీని ట్యాంపరింగ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన తర్వాతే నిర్ధారిస్తాం. భూభారతి, రెవెన్యూ సదస్సుల వల్ల కొన్ని సార్లు రిజిస్ట్రేషన్‌లో జాప్యం జరిగినా పెండింగ్‌లో ఉంచడం లేదు. కార్యాలయం బయట ఏం జరుగుతుందో తెలియదు. సిబ్బంది పనితీరుపై ఆరా తీసి అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.



# నిబంధనలు బూడిదపాలు

, హుజూర్‌నగర్: నవంబర్ 29(భారత శక్తి ):మిల్లుల్లో బూడిదకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అది తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం బూడిద బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలి. కానీ జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల మిర్యాలగూడ రోడ్డులో సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్లే పరిస్థితి లేదు.

యజమానులు మిల్లును నడుపుతున్న సమయంలో బూడిద బయటకు వచ్చి కాలుష్యం పెరిగిపోతుంది. బూడిదను ఎత్తించే క్రమంలోనూ జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే గురువారం బూడిద కుప్ప కూలి నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఒకట్రెండు రోజుల క్రితమే వచ్చిన బూడిదను కూలీలతో ఎత్తించడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. పాత బూడిదను లోడు చేసుకునేలా చర్యలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. మిల్లర్లు బూడిదను ఇటుకలు తయారు చేసే వారికి అమ్ముతుంటారు. ఆదాయం వస్తున్నా జాగ్రత్తలు మాత్రం ఉండటం లేదు.

బూడిదకు ప్రత్యేకంగా గదిని నిర్మించి దానిలో పడేలా ఏర్పాటు చేయడంతో పాటు గాలికి లేవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కొన్ని చోట్ల ఇలా ప్రత్యేక గదులు లేవు. ప్రహరీలు కూడా లేని మిల్లులు ఉన్నాయి. అయినా వాటికి అధికారులు అన్ని అనుమతులు ఇవ్వడం వల్ల పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.



# ఐదు రూపాయలకే అన్నం

భానుపురి, పంట ఉత్పత్తుల విక్రయానికి వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి విపణికి వచ్చిన రైతన్నలకు భోజనంతో ఆతిథ్యం ఇస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇటీవల సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రూ.5 భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

సూర్యాపేట మార్కెట్ తెలంగాణలోనే రెండో అతిపెద్ద విపణి. ఇక్కడ నిరంతరం పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు సాగుతాయి. జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్లున్నా.. ఎక్కడా భోజన సదుపాయం లేదు. ధాన్యం విక్రయాలకు వచ్చిన రైతులు పొద్దస్తమానం ఆకలితో అలమటిస్తుంటారు. వీటిని గమనించిన నూతన పాలక వర్గం, మార్కెట్ అధికారులు ఆలోచించి హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులతో మాట్లాడి ఒక్కో భోజనానికి మార్కెట్ అధికారులు రూ.29.17 పైసలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. రైతుల వద్ద నుంచి రూ.5 తీసుకొని పప్పు, సాంబారు, కర్రీతో రోజూ అందజేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు నిత్యం 600 భోజనాలు తయారు చేస్తున్నారు.

పంట నూర్పిడి చేసిన వెంటనే మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చేదాన్ని. ఉదయం, మధ్యాహ్నం ఇంటి నుంచే మా కుమారుడితో భోజనం తెప్పించుకొనేదాన్ని. కాంటా వేసిన తర్వాత సాయంత్రం భోజనం చేసేవాళ్లం. పొద్దస్తమానం ఆకలితో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఎంతో సౌలభ్యంగా మారింది.

మార్కెట్‌లో ఇటీవల మహబూబాబాద్ నుంచి వచ్చిన ధాన్యం రైతుతో మాట్లాడా. అన్నం తిన్నావా.. అని అడగడంతో ధాన్యం కాపలా ఎవరూ లేరు..కాంటా వేసిన తర్వాత తింటానని చెప్పాడు. ఆయన మాటలు నన్ను కదిలించాయి. వెంటనే మార్కెట్ అధికారులతో సమావేశం నిర్వహించి రాష్ట్ర మార్కెట్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నాం. ఫౌండేషన్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకొని భోజనం సదుపాయం కల్పించాం.



# రూ.50 వేలిస్తేనే.. ఇంటికి వెలుగు

తుంగతుర్తి, నవంబర్ 29(భారత శక్తి ): నీడ లేని పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇల్లు కట్టుకోడానికి అవసరమైన విద్యుత్తు సర్వీసు మంజూరు చేయడానికి సంబంధిత శాఖ ఉద్యోగి లబ్ధిదారుల నుంచి రూ.50 వేలు వసూలు చేసిన ఘటన తుంగతుర్తిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన మెంతబోయిన మనీషకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం నివాసం ఉంటున్న దగ్గర సరిపడా స్థలం లేక నాగారం రోడ్డులోని తన భూమిలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులకు విద్యుత్తు అవసరం ఉండటంతో సర్వీసు కోసం స్థానిక విద్యుత్తు సిబ్బందిని సంప్రదించగా.. నూతనంగా సర్వీసును ఇవ్వాలంటే రూ.80 వేలు ఖర్చు అవుతుందని మొదట తెలిపారు. అంత ఇచ్చుకోలేమని వేడుకోగా ఆఖరికి రూ.50 వేలకు ఒప్పుకొన్నారు. ఈ నెల 24న రూ.25 వేల నగదును, సిబ్బంది చెప్పిన వ్యక్తికి మరో రూ.25 వేలను ఫోన్‌లో పంపారు. ఆ తర్వాత జరిగిన విషయాన్ని మండల ఏఈ సురేందర్‌తో ఫోన్‌లో తెలిపి ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఏఈకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదును వాట్సాప్ ద్వారా పంపామని తెలిపారు.

# దూరమే భారం.. ఇంకెన్నాళ్లీ శాపం..?

ఇల్లెందు పట్టణం, నవంబర్ 29(భారత శక్తి ):టేకులపల్లి, ప్రతి నియోజకవర్గ పరిధిలో బీసీ గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానికంగా ఉన్న పాత ప్రభుత్వ కార్యాలయాలు, మూతబడిన ప్రైవేటు కళాశాలల భవనాల్లో 2017 నుంచి తరగతులు ప్రారంభించింది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో గురుకులాల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. మంజూరైన కేంద్రం నుంచి పట్టణాలకు బీసీ గురుకులాలను తరలించి అక్కడే నిర్వహిస్తున్నారు. బీసీ గురుకుల భవనాల నిర్మాణాలకు స్థలాలు ఉన్నప్పటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.




ఎక్కడెక్కడ ఎన్నెన్ని..

ఖమ్మం జిల్లాలో 15 గురుకుల పాఠశాలలు, ఒక డిగ్రీ కళాశాల ఉన్నాయి.వీటిలో 7,500మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదకొండు గురుకులాలతో పాటు ఒక డిగ్రీ కళాశాల ఉంది. 4,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఒక్కదానికీ సొంత భవనం లేదు..

ఉభయ జిల్లాల్లోని గురుకులాలకు ఒక్కటంటే ఒక్కటి కూడా సొంత భవనాలు లేవు. సత్తుపల్లి, బోనకల్లు, టేకులపల్లి, వైరాలోని గురుకులాలు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నప్పటికీ అవి కూడా గురుకులాల భవనాలు కావు. మిగిలిన గురుకులాలు అన్నీ కూడా ప్రైవేటు భవనాల్లో అద్దె ప్రాతిపదికన నిర్వహణలో ఉన్నాయి. సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఖమ్మం ఆర్‌సీఓ రాంబాబు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..టేకులపల్లి మండలానికి మంజూరయిన బాలికల పాఠశాల టేకులపల్లిలో భవన వసతి లేకపోవడంతో ఖమ్మంలోని దేర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

పినపాక బాలికల గురుకులం మణుగూరులో కొనసాగుతోంది. చుంచుపల్లి బాలుర గురుకులం సుజాతనగర్ వేపలగడ్డలో ఉంది.భద్రాచలం బాలుర గురుకులం లక్ష్మీపురంలో, దుమ్ముగూడెంలోని రెండు గురుకులాలను కూడా భద్రాచలంలో నిర్వహిస్తున్నారు.ఖమ్మం జిల్లాలో..ఎర్రుపాలెం గురుకులం మధిరలో, బోనకల్లు జూనియర్ కళాశాల వీవీకృష్ణాపురంలో కొనసాగుతున్నాయి.ముసలిమడుగు గురుకులంలో రెబ్బవరంలో ఉంది.

వైరా బాలుర గురుకులంలో కొణిజర్లలో ఉంది. నేలకొండపల్లి మండలం చెరువు మాధారం బాలికల గురుకులం రఘునాథపాలెంలో ఉంది.

లంకపల్లి బాలికల పాఠశాల కుప్పెనకుంటలో, సత్తుపల్లి బాలికల పాఠశాల లంకపల్లిలో ఉంది.



# తీగలవాగు.. కానరాని సాగు

మల్హర్, నవంబర్ 29(భారత శక్తి ): అన్నదాత నిరీక్షణ ఫలించడం లేదు. దశాబ్దాల కల నెర వేరడంలేదు. మెట్ట ప్రాంతానికి సాగు నీరందించేందుకు మల్హర్ మండలం పెద్దతూండ్ల సమీపంలోని తీగలవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. 50 ఏళ్ల క్రితం రూ.13 లక్షలతో తొలిసారిగా పునాది పడింది. అప్పటి నుంచి నిర్మాణ దశలో మూడుసార్లు గండి పడటంతో ప్రాజెక్టు ప్రగతి మొదటికొచ్చింది. ఏళ్లు గడుస్తున్నా.. పురోగతి కనిపించకపోవడంతో.. కర్షకులు సాగు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

మల్హర్ మండల పరిధి పెద్దతూండ్ల, గంధంపల్లి, దుబ్బపేట, మల్లారం గ్రామాల్లోని 750 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యం విధించారు. 1975లో పనులు మొదలు పెట్టారు. నిర్మాణ సమయంలో 1983, 1986 సంవత్సరాలలో రెండుసార్లు కొట్టుకుపోయింది. ఇరవై ఏళ్ల తర్వాత 2006లో అప్పటి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో రూ.3.74 కోట్లు కేటాయించగా.. పనులు తుదిదశకు చేరాయి. ఈ క్రమంలో 2010లో కురిసిన భారీ వర్షాలకు మూడోసారి గండిపడటంతో సమస్య మొదటికొచ్చింది. అప్పటి నుంచి ప్రతిపాదనలకు నోచుకోవడంలేదు.

రూ.9.50 కోట్ల పరిహారం చెల్లింపు

ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురవుతున్న 84 ఎకరాలకు భూసేకరణ పూర్తి చేసిన అధికారులు ఇటీవల రూ.9.50 కోట్ల పరిహారం చెల్లించారు. వరద నీటి ఉద్ధృతి అంచనా వేసేందుకు నీటిపారుదల శాఖ డ్యాం సేఫ్టీ అధికారులకు మే నెలలో నివేదించింది. నాణ్యమైన ప్రమాణాలతో నిర్మిస్తున్నప్పటికీ.. ఎందుకు కొట్టుకుపోతుందో కారణాలపై అధ్యయనం చేస్తున్నారని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. నెలల తరబడి నివేదిక సమర్పించడంలో జాప్యం నెలకొంది.

మంత్రిపైనే ఆశలు..

ఆయకట్టు రైతులు పునర్నిర్మాణానికి ఎదురుచూస్తున్నారు. గతంలో మాదిరిగానే నిధులు మంజూరు చేస్తారని మంత్రి శ్రీధర్‌బాబుపై ఆశలు పెట్టుకున్నారు. భూగర్భ జలాలు ఏటికేటా పడిపోతున్నాయి. ఒక్కో రైతు రెండు మూడు బోర్లు వేసినా.. చుక్క నీరు రావడంలేదు. ప్రాజెక్టు నిర్మిస్తే సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది.

బోరు వేసినా ఫలితం లేదు..: నరసింహనాయక్, దుబ్బపేట

గ్రామ శివారులోని ఐదెకరాల్లో సేద్యం చేస్తున్నా.. నీటి కోసం బోరు వేయడం ఆర్థిక భారమవుతోంది. ఇప్పటికే రెండుసార్లు వేశాం. చుక్కనీరు రావడం లేదు. నీటి తడులు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టు నిర్మిస్తే సాగు నీటి కష్టాలు తీరనున్నాయి.

# వార్డు సభ్యులపైనా దృష్టి

వరంగల్: నవంబర్ 29(భారత శక్తి ):పంచాయతీ ఎన్నికలు అనగానే సర్పంచిగా పోటీ చేసి గెలుపొందాలనే ఆలోచనతో ఆశావహులంతా ఉంటారు. వీరికి మద్దతిచ్చే పార్టీల వ్యూహం మాత్రం దీనికి భిన్నంగా ఉండనుంది. కేవలం సర్పంచి పదవిని గెలుచుకోవటంపైనే దృష్టి పెడితే.. రాజకీయంగా మరో ప్రతికూలతను ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందనేది వారి ఆలోచన. గ్రామంలో ఏ పని చేయాలన్నా పంచాయతీ తీర్మానమే కీలకం. మెజారిటీ వార్డు సభ్యులు ఆ నిర్ణయాన్ని సమ్మతించాలి. ఈ క్రమంలో తమకు అనుకూలంగా ఉన్నవారినే వార్డుల నుంచి గెలిపించుకోవాలి. ప్రతి ఓటరు సర్పంచికి ఒక ఓటు, వార్డు మెంబర్‌కు మరో ఓటు వేస్తారు. ఒకే పార్టీ మద్దతుతో బరిలో ఉన్న వారికే రెండు ఓట్లు వేస్తారనే గ్యారంటీ లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొనే గ్రామంపై పూర్తిస్థాయి పట్టుకోసం రెండు పదవులను గెలుపొందేలా ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి.

తొలి విడతపైనే..: అన్ని పార్టీలు తొలిదశ పోలింగ్ ఉన్న పంచాయతీలపై ప్రస్తుతానికి దృష్టి పెట్టాయి.తొలి విడత ఫలితాలు 11న రానున్నాయి. వీటి ప్రభావం రెండు, మూడో విడతలపై ఉంటుందనే ఆలోచనతో మొదటి విడతలో సత్తా చాటాలనే వ్యూహాలతో నాయకులున్నారు. కాంగ్రెస్‌లో ప్రజాప్రతినిధులు, డీసీసీ అధ్యక్షులు మేజర్ పంచాయతీల అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. గురువారం ఆశావహుల పేర్లపై ఆయా మండలాల నాయకులతో చర్చించారు. భారాస నేతలు కూడా దీక్షా దివస్ సన్నాహక సమావేశాల సందర్భంలోనే ఈ అంశాన్ని కూడా చర్చిస్తున్నారు.

ఎంపిక బాధ్యత వారిదే..: బరిలో నిలిపే అభ్యర్థుల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాయి. రిజర్వేషన్ల ఆధారంగా గెలుపు అవకాశాలున్న వారి పేర్లను సూచించాలని ఆయా పార్టీ నేతలు మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులకు సూచించారు. సర్పంచి, వార్డు సభ్యుడి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. పోటీకి ఎక్కువ మంది ఆసక్తి చూపే చోట మూడేసి పేర్లు సూచిస్తే కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు, భారాసలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు వారిలో నుంచి ఒకరిని ఎంపిక చేస్తారంటున్నారు. భాజపా సైతం బలం ఉన్న గ్రామాల నుంచి పోటీకి నిలిపే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. వామపక్షాలు సైతం తమకు పట్టున్న గ్రామాల్లో పోటీకి నిలిపేందుకు సిద్ధమవుతున్నాయి.

# కడుపు 'కోత'లే



జనగామ నవంబర్ 29(భారత శక్తి ): ప్రసూతి కాన్పులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని, సిజేరియన్లను తగ్గించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. జిల్లాలో సైతం ప్రభుత్వ దవాఖానాల్లో కొంత మేర సాధారణ ప్రసవాలు జరుగుతున్నా.. ప్రైవేటు వైద్యశాలలో మాత్రం అడ్డూ అదుపు లేకుండా సిజేరియన్లు చేస్తున్నారు.

45 శాతమే సాధారణం..

జిల్లా పరిధిలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. వైద్యవిధాన పరిషత్ పరిధిలోని బచ్చన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి సీహెచ్‌సీల్లో అడపాదడపా సాధారణ కాన్పులు అవుతున్నాయి. ఇతర ఏ పీహెచ్‌సీలో కూడా ప్రసవాలు చేయడం లేదు. ఎంసీహెచ్‌లో జరుగుతున్న కాన్పులను పరిశీలిస్తే 45 శాతం సాధారణ కాన్పులు అవుతండగా, 55 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు 70 శాతం సాధారణ కాన్పులు, 30 శాతం సిజేరియన్ల శాతం ఉండాలి. అయితే 50 శాతానికి కూడా సాధారణ ప్రసవాలు చేరడం లేదు. ఎంసీహెచ్‌లో మొదటి కాన్పులో సిజేరియన్లు చేసుకున్నవారికి.. రెండు, మూడో కాన్పులకు సంబంధించి సిజేరియన్లే చేయడం తప్పనిసరిగా మారిందని వైద్యులు చెబుతున్నారు.

ప్రైవేటులో అడ్డూ అదుపు లేకుండా..

జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు మెటర్నిటీ ఆసుపత్రుల్లో మాత్రం మొదటి కాన్పులు, రెండో కాన్పులు అంటూ తేడా లేకుండా కాసుల కోసం ఇష్టానుసారంగా సిజేరియన్లు మాత్రమే చేస్తున్నారు. ఒక్కో కాన్పుకు రూ.40 వేల నుంచి 50 వేలు వసూలు చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చూపించే లెక్కల్లో తూతూ మంత్రంగా కొద్దిపాటిగా సాధారణ కాన్పులు చేస్తున్నామని కాకి లెక్కలు చూపుతున్నారు. ఈ విషయంలో జిల్లా వైద్యాధికారులు పకడ్బందీగా తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జిల్లా దిశ కమిటీ సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య జిల్లాలో విచ్చలవిడిగా జరుగుతున్న సిజేరియన్ల నేపథ్యంలో వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలు పెంచాలని ఆమె సూచించారు.

# వారిది ధన దాహం.. రోడ్లు ఏమైతేనేం

ములుగు, నవంబర్ 29(భారత శక్తి ):ఏటూరునాగారం, జిల్లాలో ఇసుక లారీల కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. వ్యాపారుల ధన దాహం రోడ్లకు ముప్పుగా మారుతోంది. పది కాలాలపాటు మన్నిక రావాల్సిన రోడ్లు అధిక బరువుతో తిరిగే లారీల కారణంగా గుంతలు పడి దుస్థితికి చేరుతున్నా ఇసుక వ్యాపారులకు పట్టడం లేదు. రైజింగ్ గుత్తేదారులు, తెలంగాణ



మైనింగ్ అభివృద్ధి అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. జిల్లాలోని మంగపేట మండలం వాడగూడెం, రమణక్కపేట, వెంకటాపురం మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ పరిధిలోని అబ్బాయిగూడెం వద్ద ఆన్‌లైన్ ఇసుక విక్రయాలు నిర్వహిస్తున్నారు.

నిబంధనలకు పాతర..

నిబంధనల మేరకు 12 టైర్ల లారీలో 26 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే లోడ్ చేయాల్సి ఉండగా.. 28 నుంచి 30 మె.టన్నులు తరలిస్తున్నారు. 14 టైర్ల లారీలో 32 మె.టన్నులు భర్తీ చేయాల్సి ఉండగా 37 నుంచి 38 మె.టన్నుల ఇసుకను లోడ్ చేస్తున్నారు. 35 మె.టన్నుల ఇసుక తరలించాల్సిన 16 టైర్ల లారీలో 38 నుంచి 40 మె. టన్నుల వరకు నింపుతున్నారు.

ఖజానాకు గండి..

తెలంగాణ మైనింగ్ శాఖ మెట్రిక్ టన్ను ఇసుకను రూ.375 ధరతో విక్రయిస్తోంది. ఒక్కో లారీలో అదనంగా ఆరు మెట్రిక్ టన్నుల ఇసుక తరలిపోతుండడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.2,250 చొప్పున గండిపడుతోంది. రోజుకు 500 నుంచి 600 లారీల్లో వేలాది మెట్రిక్ టన్నుల ఇసుక తరలిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.లక్షల్లో గండి పడుతోంది. ఇదే ఇసుకను వ్యాపారులు హైదరాబాద్‌లో మెట్రిక్ టన్ను రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. అదనంగా తరలించిన ఆరు మె.టన్నులకు రూ.12 వేలు అక్రమంగా సంపాదిస్తున్నారు. ఏటూరునాగారం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు నామమాత్రంగానే మారింది.

ఇదీ రహదారుల పరిస్థితి..

తాడ్వాయి-ఏటూరునాగారం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ములుగు నుంచి మల్లంపల్లి వరకు జాతీయ రహదారి బీటీ పోయి అధ్వానంగా మారింది.

వెంకటాపురం మండలంలో భద్రాచలం రహదారి అధికలోడు వాహనాల రాకపోకలతో పలుచోట్ల ధ్వంసం అయింది.

గోవిందరావుపేట మండలంలో పస్రా సమీపంలో పరిస్థితి దారుణంగా ఉంది.

వెంకటాపురం మండలంలో ఇసుక తరలిస్తున్న లారీల కారణంగా దుమ్ము లేచి పంటలపై పరుచుకొని నష్టం కలుగుతోందని రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

# అమ్మబోతే కొర్రీలు.. కొన్నాక కోతలు

గంగాధర నవంబర్ 29(భారత శక్తి ):: వరి ధాన్యం పండించే శ్రమ కన్నా అమ్ముకోవడమే అన్నదాతకు కష్టంగా మారింది. యాసంగి పంటల సాగులో తలమునకలు కావాల్సిన వారు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి అరిగోస



పడుతున్నారు. జిల్లాలోని పలు కేంద్రాల నుంచి పంపిన ధాన్యం బస్తాలను మిల్లర్లు ఆలస్యంగా దింపుకొంటున్నారు. దీంతో తూకం వేసిన ధాన్యంలోనూ బరువు నష్టపోతున్నారు. మిల్లు యాజమాని తక్కువ బరువు ఉందని కోత విధించి కేంద్రం నిర్వాహకులకు ఫోన్లో సమాచారమిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర నిర్వాహకుడు రైతుకు తెలియజేయగా.. చేసేదేమిలేక ఒప్పుకుంటున్నారు.

సన్నాలు కావాలని.. వడ్లు నిండుకున్నాయని..

జిల్లాలో 325 కేంద్రాల ద్వారా 32,390 రైతుల నుంచి 2,00,325 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 1,98,901 మె.ట తరలించారు. ఇంకా 1423 మె.ట ధాన్యం కేంద్రాల నుంచి తరలించాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు బాగుండీ, వడ్లు తేమ లేకుండా ఉన్నప్పటికీ తూకం వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్నాలు కావాలని, ఇప్పటికే దొడ్డు రకం ధాన్యంతో రైస్‌మిల్లుల్లో స్థలం లేదని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. లేకపోతే 43.500 కిలోలు తూకం వేసి పంపిస్తేనే దింపుకొంటామని చెప్పడంతో చాలా కేంద్రాల్లో ధాన్యం తూకాలను నిలిపివేశారు.

సమస్య మా దృష్టికి రాలేదు. కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. ఏదైన సమస్య ఉంటే రైతులు మాకు చెప్పాలి.

చాలా ఇబ్బందిగా ఉంది

లారీలు రావడంలేదని, సంచులు లేవని నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారు. ధాన్యం ఆరబెట్టినా ఎక్కువ తూకం వేస్తామంటున్నారు. మార్కెట్‌లోంచి ధాన్యం తీసుకెళ్లి ప్రైవేటుకైనా అమ్ముకుంటాం. 15 రోజులుగా ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్‌కు వస్తున్నాం. 43 కిలోలపైగా తూకం వేస్తామంటున్నారు. పంట పండించడం కంటే కూలీ పనులకు వెళ్లడమే మంచిది.



# వారంలోనే అంతా.. అభ్యర్థులకు చింత

కొత్తగూడ, నవంబర్ 29(భారత శక్తి ):పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇచ్చిన షెడ్యూల్‌లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అనంతరం ప్రచారానికి వారం గడువు మాత్రమే సమయం మిగులుతోంది. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు నామపత్రాల ఉపసంహరణ పూర్తి అయ్యాకనే పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ మేరకు వారం రోజుల గడువు మాత్రమే నెలకొనడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. రెబల్స్, ఇతర అంశాలపై నామినేషన్ల ఉపసంహరణపై దృష్టి సారించడానికే సమయం సరిపోయే పరిస్థితి నెలకొనడంతో ఈసారి ఆందోళన తప్పడం లేదు.

మొదటి విడత గురువారం పోలింగ్ గ్రామాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా డిసెంబరు 3వ తేదీన అభ్యర్థుల పేర్లు, గుర్తులను ప్రకటిస్తారు. డిసెంబరు 11న ఎన్నికలుంటాయి.

రెండో విడత ఎన్నికల్లో ఈ నెల 30న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. డిసెంబరు 6వ తేదీన తుది జాబితా, గుర్తుల ప్రకటన, డిసెంబరు 14న ఎన్నికలు నిర్వహిస్తారు.

మూడో విడతలో డిసెంబరు 3న నామినేషన్ల స్వీకరణ, డిసెంబరు 9న అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల ప్రకటన డిసెంబరు 17న ఎన్నికలు జరుగుతాయి.

మూడు విడతల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికలకు వారం రోజుల సమయం మాత్రమే ఉంటోంది. వారంలోనే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రచారానికి సమయం తక్కువగా ఉంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళితేనే అభ్యర్థులు ఎన్నికల్లో సత్తాచాటే అవకాశాలుంటాయి. రెండు, మూడో విడతల్లో ఎన్నికలు జరిగే పంచాయతీలకు కాస్త సమయం ఎక్కువ ఉన్నప్పటికీ నామినేషన్లు వేసేలోపు అభ్యర్థుల ఎంపికనేది ముందస్తుగా నిర్ణయం జరిగి రెబల్స్ బెడద లేకుండా చూసుకుంటే ప్రచారానికి ఎక్కువ సమయం లభిస్తుంది.

# మనసు పెట్టి.. పతకాలు కొట్టి

జగిత్యాల నవంబర్ 29(భారత శక్తి ): 64 గడులపైనే మనసు కేంద్రీకరించి, నిర్దేశిత సమయంలో మెదడుకు పదును పెడితేనే చదరంగం ఆటలో విజయం వరిస్తుంది. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే కింది స్థాయి పోటీల నుంచే రాణించాలి. ఇటీవల జగిత్యాల పట్టణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్విస్ లీగ్ విధానంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి పలువురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన క్రీడాకారుల నేపథ్యంతో కథనం..

ఒకటో తరగతి నుంచే ఆసక్తి

కరీంనగర్‌కు చెందిన కుమ్మరి సాధన తండ్రి సంతోష్‌కుమార్ ఎల్‌ఐసీలో ఉద్యోగి, తల్లి షారా ప్రభుత్వ ఉపాధ్యాయిని. ఒకటో తరగతి నుంచే ఆటపై ఆసక్తి పెంచుకుంది. చరవాణి సాయంతో నైపుణ్యం పెంచుకుంటోంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1416లో కొనసాగుతోంది. గతంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏడేళ్లలోపు విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో ఏడో స్థానంలో, రాష్ట్ర స్థాయిలో అయిదో స్థానంలో నిలిచింది. గ్రాండ్‌మాస్టర్ కావడమే లక్ష్యమని సాధన చెబుతోంది.

గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడమే ధ్యేయం

కరీంనగర్‌కు చెందిన వేముల అభిరామ్ పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి రామకృష్ణ ప్రభుత్వ అధ్యాపకుడు, తల్లి పావని గృహిణి. నాలుగేళ్లుగా నిత్యం రెండున్నర గంటల పాటు సాధన చేస్తున్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1462తో కొనసాగుతున్నాడు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సార్లు చొప్పున పాల్గొని ప్రతిభ చాటాడు. మార్వెల్ పోటీల్లో పతకం సొంతం చేసుకున్నాడు. ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా స్థిరపడటం, గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడం జీవిత ధ్యేయమని పేర్కొన్నాడు.

నిరంతర సాధనతో గుర్తింపురంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరికా ఎస్‌వీ పదో తరగతి చదువుతోంది. తండ్రి శివానంద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, తల్లి శృతి బిహేవియర్ థెరపిస్ట్. ఏడాది కిందట రీజినల్ పోటీల్లో ప్రతిభతో గుర్తింపు పొందింది. నాటి నుంచి నిరంతర సాధనతో అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1480తో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఐసీఎస్‌సీ జాతీయ స్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొంది.

## లెక్క చూపించాల్సిందే.. నిబంధనలు పాటించాల్సిందే

సిరిసిల్ల, నవంబర్ 29(భారత శక్తి ): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేస్తున్న ప్రతి పైసాను లెక్కిస్తారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఎన్నికల వ్యయ పరిశీలకులు ఉంటారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో మండలానికి అయిదు బృందాలను కేటాయించారు. వీరు ప్రలోభాలు.. పదవుల వేలంపాటల నిర్వహణ మొదలు.. పోటీలోని సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల ప్రచార వ్యయాల వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఉమ్మడి జిల్లాలో తొలివిడత 22 మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. వాస్తవానికి ఈ బృందాలు నామపత్రాల దాఖలు రోజు నుంచే గ్రామాలవారీగా పర్యటించాలి. కానీ పరిశీలన సిబ్బంది ఎంపిక.. శిక్షణ.. విధుల కేటాయింపులో జాప్యమైంది.

ఖర్చుల పరిధి ఇలా..

అయిదు వేలకుపైగా జనాభా ఉంటే సర్పంచి అభ్యర్థులకు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ.50 వేలు, అయిదువేల లోపు జనాభా ఉన్నవాటిలో రూ.1.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ.30 వేల ఖర్చు చేసే పరిమితులున్నాయి. ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా అభ్యర్థులు ఖర్చుల వివరాలను అధికారులకు సమర్పించాలి.

అభ్యర్థులు తమ ఖర్చులను నామినేషన్ పత్రాలతో సమర్పించిన బ్యాంకు ఖాతాలో చూపించాలి. వీటిని మండల కేంద్రాల్లోని ఎన్నికల వ్యయ పరిశీలకులచే లెక్కించి ధ్రువపత్రం పొందాలి.

అధికారుల లెక్కలకు, అభ్యర్థులు చూపించినవాటికి సరిపోవాలి. లేకుంటే మూడేళ్లపాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఉంటుంది.

2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 410 మంది సర్పంచి అభ్యర్థులు, 4228 మంది వార్డు సభ్యులు, 30 జడ్పీటీసీలు, 387 మంది ఎంపీటీసీలపై వేటు పడింది. కాగా 2024లో వీరందరిపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది.

ప్రలోభాల ఏకగ్రీవాలు చెల్లవు

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఏకగ్రీవ పంచాయతీల కోలాహలం మొదలైంది. తొలి విడత ఎన్నికలు జరిగే చందుర్తి, రుద్రంగి మండలాల్లోని పలు గ్రామాలు ఇప్పటికే ఏకగ్రీవంగా ప్రకటించుకున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లాల నుంచి ఏకగ్రీవ పంచాయతీలు, వార్డుల వివరాలు కోరుతుంది. మూడు దశల్లో ఎన్నికల అధికారులు విచారణ జరుపుతారు. ఆ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఏకగ్రీవాలుగా ఆమోదం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నజరానాలకు ప్రలోభాలకు తావులేకుండా ఏకగ్రీవమైనవి మాత్రమే అర్హులుగా ప్రకటిస్తారు.

## అప్పులకు వడ్డీలు.. అసంపూర్తి నిర్మాణాలు

ముస్తాబాద్ నవంబర్ 29(భారత శక్తి ):: గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న రెండు పడక గదుల ఇళ్లకు బిల్లులు రాక లబ్ధిదారులు అప్పుల్లో కూరుకుపోయారు. జిల్లాలోని గ్రామాల్లో సొంత స్థలం ఉండి.. ఇల్లు నిర్మించుకోవటానికి ముందుకు వచ్చేవారికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అప్పటి సర్పంచులు నాటి మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కోరారు. ఆయన అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఆదేశించగా.. గ్రామసభలు నిర్వహించి సొంత స్థలం ఉన్న పేద, మధ్యతరగతి వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారు అప్పులు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. దాదాపు 6 ఏళ్లు గడుస్తుండగా.. వడ్డీలు పెరిగిపోతున్నాయి కానీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముస్తాబాద్, మద్దికుంట, మోహినికుంట, చిప్పలపల్లి, పోత్గల్, గూడెం, కొండాపూర్ గ్రామాలకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. దాదాపు 2018-19 సంవత్సరంలో నిర్మాణాలు ప్రారంభించారు. రూ.5 లక్షలు సరిపోవని మరో రూ.5లక్షలు పెంచితే బాగుంటుందని లబ్ధిదారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అది అంతలోనే ఆగిపోయింది.

గ్రామాలవారీగా ఇలా..

ఆవునూర్ గ్రామంలో 28 మంది లబ్ధిదారులు ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ఒక బిల్లు కూడా మంజూరు కాలేదు. ఇంటి నిర్మాణం పూర్తికాక.. బిల్లు రాక.. ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

సేవాలాల్‌తండాలో 8 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి బిల్లులు వచ్చిన దాఖలాలులేవు.

తెర్లుమద్దిలో 17 మంది వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకున్నారు. కొందరికి 1 నుంచి 3 బిల్లుల వరకు మాత్రమే వచ్చాయి.

వెంకట్రావుపల్లె 20 రెండు పడక గదుల ఇళ్లకు... ముగ్గురు లబ్ధిదారులు పనులు ప్రారంభించారు.

తుర్కపల్లె గ్రామంలో 24 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నలుగురికి అసలే బిల్లులు రాలేదన్నారు.

బందనకల్‌లో 12 మంది నిర్మాణాలు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో బిల్లులు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

మొర్రాయిపల్లెలో 7 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు మంజూరైన దాఖలాలు లేవు.

చీకోడ్‌లో 48 ఇళ్లు మంజూరు కాగా.. ఒక్కరు నిర్మించుకోలేదు.

అధికారులు ఎంబీ రికార్డు చేయాలి. దీనికి ఈవోటీ(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) అడుగుతున్నారంటూ లబ్ధిదారులు అంటున్నారు. ఈవోటీ ఇప్పించి బిల్లులు వచ్చేలా అధికారులను లబ్ధిదారులు వేడుకొంటున్నారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటికే రూ.15లక్షల వరకు ఖర్చు అయింది. ఇంతవరకు ఒక్క బిల్లు రాలేదు. దీంతో అసంపూర్తిగానే మిగిలిపోయింది. బిల్లుల కోసం అప్పటి సర్పంచి

# మరో కొత్త అడుగు



ే, గోదావరిఖని: నవంబర్ 29(భారత శక్తి ): గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తున్న సింగరేణి పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్(పీఎస్‌పీపీ) ఏర్పాటుకు సర్వే ప్రక్రియ చేపట్టింది. ప్లాంట్ నిర్మాణం కోసం వ్యాప్కోస్ సంస్థకు అధ్యయన బాధ్యతలు అప్పగించింది. సింగరేణికి చెందిన మేడిపల్లి ఓసీపీని నాలుగేళ్ల కిందట మూసివేశారు. క్వారీలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకొని హైడల్ విధానంలో విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేశారు. దీని కోసం క్వారీలో ఉన్న జలాశయంతో పాటు ఉపరితలంలో మరో జలాశయం నిర్మించి మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయాలని భావించారు. రూ.2,535 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే కేంద్రంలో ఏటా 1560 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నారు. 500 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ప్లాంట్ ద్వారా సింగరేణికి ఆదాయం సమకూరుతుందని ఆశిస్తున్నారు.

పగలంతా సౌర విద్యుత్తు

నీటిని ఎత్తిపోసేందుకు నడిపించే యంత్రాలకు సౌరవిద్యుత్తును వినియోగించనున్నారు. దీనికి సంస్థకు చెందిన సౌర విద్యుత్తును సరఫరా చేయనున్నారు. 150 మీటర్ల ఎత్తులోకి నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి కిందకు జారవిడిచే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. నీటిని కిందికి వదిలే సమయంలో జనరేటర్ల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తయ్యే విద్యుత్తును డిమాండ్ సమయంలో విక్రయించడం ద్వారా లాభం వస్తుందని సంస్థ అంచనా వేసింది. విద్యుత్తు డిమాండ్ సమయంలో ఒక యూనిట్ రూ.9 వరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ ప్లాంట్ ద్వారా ఒక యూనిట్ విద్యుత్తు ఉత్పత్తికి రూ.7 వరకు ఖర్చు వస్తుంది. విద్యుత్తు డిమాండ్ సమయంలో అమ్మడం ద్వారా ఒక యూనిట్‌కు రూ.2 లాభం వచ్చే అవకాశం ఉంటుందని సింగరేణి ప్రణాళికలు వేసింది.

వ్యాప్కోస్ సంస్థ అధ్యయనం పూర్తి చేయగానే టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. 0.40 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు 260 ఎకరాల విస్తీర్ణంలో జలాశయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హైడల్ ప్రాజెక్టు మాదిరిగా ఎత్తిపోసే నీటికి అనుగుణంగా జనరేటర్లను అమర్చాలి. వీటికి సంబంధించిన పనులు త్వరలోనే మొదలు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే థర్మల్‌తో పాటు సౌర విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసిన సింగరేణి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్(బీఈఎస్ఎస్)తో విద్యుత్తును నిల్వ చేసే విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తోంది. విద్యుత్తు ఉత్పత్తి రంగంలో పీఎస్‌పీపీ ద్వారా మరో కొత్త అడుగు పడనుంది.

## పాండవుల గుట్టపై కబ్జాదారుల కన్ను

కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 29(భారత శక్తి ):: అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలు మాయమైపోతుండగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పాండవుల గుట్ట క్రమంగా తరిగిపోతోంది.

ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్ స్టేషన్, మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, రెండు పడక గదుల నిర్మాణం, రైతు వేదిక, పల్లె ప్రకృతివనం, విద్యుత్తు ఉప కేంద్రం, శ్రీజగత్ మహామునీశ్వర స్వామి ఆలయానికి, అయ్యప్ప దేవాలయానికి కొంత భూమి కేటాయించారు

ఈ ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు, మరి కొందరూ ఎలాంటి పట్టా లేకున్నా కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పెద్దల అండదండలతో..

వాస్తవంగా మట్టి తవ్వకాలు చేపట్టాలనుకునేవారు మొదట గనులశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే ఎన్‌ఓసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) సంబంధిత తహసీల్దార్‌కు పంపుతారు. అనంతరం గనులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి ఒకేసారి నిర్ణీత మట్టి తవ్వకాల ప్రదేశాన్ని సర్వే చేయాలి.



ఇవన్నీ ఉంటే మట్టి తవ్వకాలకు అనుమతించగా మట్టికి రాయల్టీ రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

రాయల్టీకి గండి

ట్రాక్టర్లు కాకుండా లారీల్లో మట్టిని గృహాలు, వేడుక వేదికలు, వెంచర్ల ప్రదేశాలకు చేరవేస్తున్నారు. ఇలా నిబంధనలు విస్మరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి పడుతోంది. ఈ విషయంపై తహసీల్దార్ జగదీశ్వర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని వివరించారు.

## లోతట్టు వారధి.. పాలకుల పట్టింపేది

జగిత్యాల నవంబర్ 29(భారత శక్తి ):: జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం వద్ద జాతీయ రహదారిపై లోలెవెల్



వంతెనతో వాహనదారులకు ఇబ్బందులు తీవ్రమయ్యాయి. ఏళ్ల తరబడి ఇదే సమస్య ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జగిత్యాల-మంచిర్యాల మార్గంలో 63వ నంబరు జాతీయ రహదారిపై 60 ఏళ్ల కిందట నిర్మించిన లోతట్టు వంతెన శిథిలావస్థకు చేరింది. వారధికి ఇరువైపులా దిమ్మెలు వరద ధాటికి కొట్టుకుపోయాయి. రాత్రి వేళ వాహనాలు అదుపు తప్పి వాగులో పడిపోయే ప్రమాదం ఉంది.

50 గ్రామాలకు ఇదే మార్గం

వాస్తవానికి ఈ రహదారిపై వంతెన నిర్మించాల్సిన బాధ్యత జాతీయ రహదారి సంస్థదే. కాగా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వరకు గ్రీన్ కారిడార్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మార్గాన్ని పూర్తి మార్చారు.

ఈ మేరకు జగిత్యాల మండలం పొలాస దాటిన తర్వాత అనంతారం పెద్దమ్మ గుడి సమీపం నుంచి యశ్వంతరావుపేట, మద్దునూరు మీదుగా రాయపట్నం చేరుకునేలా కొత్తగా రహదారి నిర్మించనున్నారు.

ఇందులో భాగంగా భూసేకరణ చేపట్టారు. త్వరలోనే గ్రీన్ కారిడార్ హైవే నిర్మాణం ప్రారంభం కానుండగా పాత మార్గంలోని వంతెనను జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పట్టించుకోవడం లేదు.

సమస్యను స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తీసుకెళ్లారు. కాగా ఎలాంటి ముందడుగు పడలేదు. వాస్తవానికి మార్గాన్ని మార్చి జాతీయ రహదారి నిర్మిస్తున్నా అనంతారం వద్ద పూర్తి స్థాయి వంతెన నిర్మించాల్సిందే.

జగిత్యాల నుంచి ధర్మపురి, బుగ్గారం తదితర మండలాల్లోని 50 గ్రామాలకు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. జాతీయ రహదారి సంస్థ స్పందించని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమైనా నిధులు కేటాయించి వారధి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జాతీయ రహదారి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించగానే నిధులు కేటాయించి వంతెన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## 'కలహాల' కాపురాలు

గోదావరిఖని: నవంబర్ 29(భారత శక్తి ): సుఖసంతోషాలతో గడపాల్సిన దంపతులు చిన్న చిన్న కారణాలతో బంధాలను తెంచుకొంటున్నారు. కొందరు ప్రాణాలు తీసుకొంటుండగా.. మరికొన్ని జంటలు విడిపోతున్నాయి. పంచాయితీల పేరుతో ఏళ్ల తరబడి విడివిడిగా ఉంటున్నారు. ఠాణా మెట్లు ఎక్కుతున్న వారు కొందరైతే.. కౌన్సెలింగ్‌లకు హాజరవుతున్న వారు మరికొందరు. అసలు రాజీకి రాక విడాకులు తీసుకుంటున్న వారు కొన్ని జంటలు. ఏడాది తిరగకుండానే పుట్టింటికి చేరుతున్నారు.

జగిత్యాలకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఈనెల 18న అత్తింటి వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. పెద్దపల్లికి చెందిన ఓ యువకుడితో 20 నెలల కిందట వివాహం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే భర్త, అత్తింటివారు ఉద్యోగం చేయాలని ఒత్తిడి చేయడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదనపు కట్నం వేధింపులు భరించలేక కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఉరివేసుకుని ఈనెల 17న ఆత్మహత్యకు పాల్పడింది. 11 నెలల కిందట జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్‌కు చెందిన యువకుడితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నకానుకలు అందజేశారు. అదనపు కట్నం కావాలని వేధింపులకు గురిచేయడంతో పుట్టింటిలోనే బలవన్మరణానికి పాల్పడింది.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన ఓ యువతి ఈనెల 14న ఆత్మహత్యకు పాల్పడింది. రామగిరి మండలం లొంకకేసారం గ్రామానికి చెందిన యువకుడితో రెండేళ్ల కిందట వివాహం కాగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో అత్తింట్లోనే బలవన్మరణానికి పాల్పడింది.

50 కేసులు.. 60 కౌన్సెలింగ్‌లు

ఉమ్మడి జిల్లాలో కుటుంబ కలహాలపై నెలకు సుమారు 50 కేసులు నమోదవుతున్నాయి. అదే స్థాయిలో సఖి కేంద్రాల్లో భార్యాభర్తలకు కౌన్సెలింగ్‌లు జరుగుతున్నాయి. పెళ్లై ఏడాది తిరగకుండానే ఠాణాలకు చేరుతున్నారు. ఇందులో ఎక్కువ శాతం విద్యావంతులు ఉంటుండగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మధ్య తరగతి, కింది స్థాయి వారిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థను తట్టుకోలేకపోతున్నారు. పోలీసు ఠాణాల్లో భార్యాభర్తలకు సంబంధించిన కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. చాలా మంది క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ఇంటిల్లిపాదికీ ఇబ్బందులే

భార్యాభర్తల వ్యవహారం కుటుంబ సభ్యులకు ఇబ్బందిగా మారుతోంది. కుటుంబానికి దూరంగా ఉండి జీవిస్తున్న జంటల్లో సమన్వయం లోపించి బలవన్మరణానికి పాల్పడితే భర్త కుటుంబ సభ్యులే కారణమని కేసులు పెడుతున్నారు. ఏ కారణంతో బలన్మరణానికి పాల్పడినా అందుకు భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులే కారణంగా చూపిస్తూ జైలుకు పంపిస్తున్నారు.

## పల్లె పోరులో పార్టీల జోరు

కరీంనగర్, నవంబర్ 29(భారత శక్తి ): మేడిపల్లి: పంచాయతీ ఎన్నికల పోరును మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పేరుకే పార్టీ రహిత ఎన్నికలైనప్పటికీ అన్ని పార్టీలు వీలైనన్ని ఎక్కువ పంచాయతీలు కైవసం చేసుకునే దిశగా వ్యూహాలు రచిస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ సంగ్రామాన్ని సవాలుగా స్వీకరిస్తున్నారు. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవగా.. నామినేషన్లు వేసిన వారిలో తమ పార్టీకి చెందిన బలమైన నేతలు బరిలో ఉండేలా.. మిగతా వారిని ఒప్పించి తప్పించేలా వ్యూహాలు రచిస్తున్నారు. తక్కువ సమయం ఉండటంతో రెండో దఫా, మూడో విడతకు సంబంధించి పోటీదారుల్లో ఎవరు మెరుగనే విషయమై గ్రామాల వారీగా ఆశావహ నాయకులతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల్లో బలం చాటాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల పర్యవేక్షణలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పార్టీ అధికారంలో ఉండటంతో అభివృద్ధికి తాము అండగా ఉంటామని గెలిపించుకునే దిశగా వ్యూహాలు రచిస్తున్నారు.

పట్టు నిలబెట్టుకునేలా..

గత ఎన్నికల్లో భారాస అత్యధిక స్థానాల్లో తాము బలపరిచ్చిన అభ్యర్థులను గెలిపించుకోగలిగింది. అప్పుడు గెలిచిన వారంతా ప్రస్తుతం మాజీలుగా ప్రజలకు దగ్గరగా ఉన్నారు. గడిచిన అయిదేళ్లలో తమకున్న అనుభవాన్ని అవకాశంగా మలుచుకోవాలనుకుంటున్నారు. ఈ మాజీ ప్రజాప్రతినిధుల్లో ఎక్కువ శాతం ఈ సారి పోటీకి సై అంటున్నారు. తమ హయాంలో చేసిన అభివృద్ధిని చూపి పట్టు సాధించాలని చూస్తున్నారు.

బలపడే దిశగా..

భాజపా గ్రామీణ స్థాయిలో బలపడేలా వ్యూహాలు రూపొందిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ల నేతృత్వంలో పల్లెల్లో పట్టు సాధించే దిశగా వ్యూహాలు రచిస్తున్నారు. పార్టీ విధేయులను బరిలో దింపి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకోవాలని చూస్తున్నారు. పల్లెల అభివృద్ధికి కేంద్రం నిధులే కీలకం అన్న విషయాన్ని ప్రచారం చేస్తూ ఓట్లు అడగానికి సిద్ధమవుతున్నారు.




# క్రమ'బద్ధకం'

భువనగిరి నవంబర్ 29(భారత శక్తి ): ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ యజమానుల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో ప్రభుత్వానికి లక్ష్యం మేరకు ఆదాయం సమకూరడం లేదు. క్రమబద్ధీకరణకు సవాలక్ష నిబంధనలు ఉండటంతో పాటు గతంలో కొనుగోలు చేసిన ఇంటి స్థలానికి సరైన దస్తావేజులు లేకపోవడంతో యజమానులు ముందుకు రావడం లేదు. పట్టణ పరిసరాల్లోని పలు వెంచర్లు, భూములు పోలీసు కేసుల్లో ఉండటం, డబుల్ రిజిస్ట్రేషన్లు ఉండటం, నివాస జోన్‌లో లేకపోవడం, నీటి వనరుల సమీపంలో ఉండటంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

పురపాలక సంఘం పరిధిలో 150 ఎకరాల భూములు కోర్టు కేసులో ఉన్నాయి. అయినప్పటికి సుమారు 700 మంది యజమానులు ఫీజులు చెల్లించి నిరీక్షిస్తున్నప్పటికి నిబంధనల అడ్డంకి కారణంగా వారికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయలేక పోతున్నారు.

గతంలో నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా వేసిన లేఅవుట్లలో పలువురు ఇంటి స్థలాలను కొనుగోలు చేశారు. ఆయా స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు యజమానులు ముందుకు రాకపోవడం గమనార్హం. నాడు మార్కెట్ ధరకు తక్కువగా ఇంటి స్థలాలు లభిస్తున్నాయన్న ఉద్దేశంతో పలువురు పెట్టుబడిగా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశారు. క్రమబద్ధీకరణ జరగని పక్షంలో ప్లాట్ విక్రయించే అవకాశం లేదని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆశించిన మేరకు ఫలితాలు రాకపోవడం గమనార్హం.

తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పాటు రోజు వారీ విధులు, ప్రభుత్వం ప్రకటిస్తున్న ఇతర విధులు నిర్వర్తిస్తుండటంతో క్రమబద్ధీకరణలో జాప్యం నెలకొంటుంది. ప్రస్తుతం ఎల్ వన్ స్టేజీలో 400 దరఖాస్తులు, ఎల్ టూ స్టేజీలో 250 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుల విచారణ సమయంలో సిబ్బందికి క్షేత్రస్థాయిలో ప్లాట్ హద్దురాళ్ల గుర్తింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు మాస్టర్ ప్లాన్, జోన్, నిషేధిత స్థలాల గుర్తింపులో సమస్యలు తలెత్తుతున్నాయి.

# వాటా.. ఆదాయ ఊట..

అశ్వారావుపేట, నవంబర్ 29(భారత శక్తి ): ఆయిల్‌ఫెడ్‌లో ముడిచమురు, గింజలతో పాటు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ రైతులకు వాటా ఇవ్వాలనే రైతు సంఘాల డిమాండ్‌కు నూనెగింజల సంస్థ తొలిసారి సానుకూలంగా స్పందించింది. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓఈఆర్ నిర్ణయ సమావేశంలో దీనిపై ప్రైవేటు పరిశ్రమలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినా రైతుసంఘాల ప్రతినిధులు పట్టుబట్టడంతో ఆయిల్‌ఫెడ్ స్పందించింది.

అప్పారావుపేట పరిశ్రమలో రెండేళ్లుగా..

ఆయిల్‌పాం గెలలను గానుగ ఆడిస్తే గింజలు వేరవుతాయి. ఖాళీగెలలు వేరుగా వస్తాయి. ఈ క్రమంలో ముడిచమురు తయారవుతుంది. గింజలను ప్రైవేటు పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. అదే గింజల నుంచి ఆయిల్(కెర్నల్) తీసే విధానాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేటలో టీజీ ఆయిల్‌ఫెడ్ రెండేళ్ల క్రితం ప్రారంభించింది. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.19,681 పలుకుతోంది. గానుగ ఆడగా వచ్చిన గింజల టన్ను ధర రూ.32వేలు ఉంది. గింజల నుంచి తయారయ్యే కెర్నల్ ఆయిల్ టన్ను ధర రూ.2.10లక్షలు పలుకుతోంది. అందుకే రైతులు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ వాటా కావాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది 29వేల టన్నుల గింజలు గానుగ ఆడగా 5వేల టన్నుల కెర్నల్ ఆయిల్ వచ్చింది. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 30వేల మంది రైతులు సుమారు 1.20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచుతున్నారు.కెర్నల్ ఆయిల్‌ను కాస్మోటిక్స్, బేకరీ పదార్థాల్లో అత్యధికంగా వాడుతుంటారు. ఆహార పరిశ్రమలు, సబ్బులు, లోషన్లు, క్రీమ్‌లు, కొన్ని రకాల ఔషధాల తయారీలో వినియోగిస్తారు.



దీనిని బయోఫ్యూయల్‌గానూ వాడతారు. అందుకే కెర్నల్ ఆయిల్‌కు డిమాండ్ అధికంగా ఉంటోంది. కెర్నల్ ఆయిల్ ద్వారా పొందే రాబడిలో రైతులకు వాటా ఇవ్వాలని ఆయిల్‌పాం రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘాల ప్రతినిధులు మూడేళ్లుగా కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన ప్రధాన కార్యదర్శి, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీకి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించటంతో ఆయిల్‌పాం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆధ్యాత్మిక గ్రామం.. స్థానిక కోలాహలం

భద్రాచలం, నవంబర్ 29(భారత శక్తి ): బూర్గంపాడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అత్యంత పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ అయిన భద్రాచలంలో పాగా వేసేందుకు రాజకీయ పార్టీలు తెర వెనుక వ్యూహరచన చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడతలోనే దీనికి పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ 40,761 మంది ఓటర్లు, 20 వార్డులు ఉండడంతో 60 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఒక పంచాయతీలో ఈ స్థాయి ఓటర్లు ఉండటం ప్రత్యేకతను చాటుతోంది. గిరిజన జనరల్ అభ్యర్థికి సర్పంచి స్థానం కేటాయించడంతో ఎస్టీ మహిళ, పురుషుల్లో ఆశావహులు బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. భద్రాచలంతో పాటు బూర్గంపాడు మండలం సారపాకలోనూ ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. ఈ జంట పట్టణాలకు తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇదే తొలి ఎన్నిక కావటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గోడకు కొట్టిన బంతిలా...

భద్రాచలం పేరు ప్రపంచవ్యాప్తంగా పరిచయం. ఇది దక్షిణ అయోధ్యగా కీర్తి పొందింది. ఇలాంటి చోట 1987 నుంచి సర్పంచి ఎన్నికలకు న్యాయపరమైన చిక్కులు తలెత్తాయి. సుదీర్ఘ విరామం



వచ్చింది. 2001లో టౌన్‌షిప్ అవడంతో ఐదేళ్లకు మించి పాలన సాగలేదు. దీన్ని రద్దు చేసి 2005లో మున్సిపాలిటీ చేశారు. పురపాలికను ఐదేళ్లు కొనసాగించకుండా న్యాయపరమైన అంశాలతో రద్దు చేశారు. ఈ పరిస్థితుల్లో 2013లో సర్పంచిని ఎన్నుకోగా 2018 వరకు కొనసాగారు. ఆ తర్వాత మళ్లీ మున్సిపాలిటీ చేస్తారని కొంతకాలం ఎన్నికలు నిర్వహించలేదు. ఈలోగా మూడు పంచాయతీలను చేయటంతో ఇది వివాదాస్పదమైంది.

# పొదుపు ఖాతా..సైబర్ కథ

కోదాడ నవంబర్ 29(భారత శక్తి ): త్రక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే లక్ష్యంతో యువత తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు. ఒకరికి లాభాలు వచ్చాయని మరొకరు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌ను ఎంచుకుని జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సైబర్ నేరాలు కోదాడ పరిసర ప్రాంతాల్లోనే జరుగుతున్నాయని బ్యాంకు నిర్వాహకులే చెబుతుండటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

నడిగూడెం, మునగాల, కోదాడ పట్టణంలోని పలు కాలనీల్లోని యువత ఓ యాప్‌లో ట్రేడింగ్‌కు బానిసలవుతున్నారు. ఇది చట్టబద్ధం అయినప్పటికీ అందులోని నగదు లావాదేవీల వల్ల అసలు సమస్య ఎదురవుతోంది. గుర్తు తెలియని వ్యక్తి పంపే నగదు నేరుగా విక్రేత పొదుపు ఖాతాల్లో పడుతుండటంతో సైబర్ నేరాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల సైబర్ దాడుల కారణంగా నడిగూడెం మండలం వల్లాపురం, సిరిపురం, మునగాల మండలం ఆకుపాముల, కోదాడ పట్టణంలోని పలు కాలనీల్లోని కొంతమంది యువకుల ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయి. వీరిని చూసి బంధువులు, స్నేహితులు సైబర్ వలకు చిక్కుతున్నారు. కోదాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న యువకులు సూర్యాపేట, హుజూర్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్ లాంటి నగరాల్లో చిరునామాలు మార్చి ఖాతాలను తెరుస్తున్నారు. బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో డిపాజిట్



చేస్తామని చెప్పినా.. నిర్వాహకులు మాత్రం పొదుపు ఖాతా తెరిచేందుకు వీలు లేదని చెప్పేస్తున్నారు.

బ్యాంకు నిర్వాహకులు గుర్తుతెలియని వ్యక్తుల పొదుపు ఖాతాలను తెరిచే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలి. యువత ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ నమ్మి మోసపోవద్దు. తెలిసిన వ్యక్తులు, గుర్తింపు పొందిన సంస్థలతోనే లావాదేవీలు జరపాలి. సైబర్ నేరాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సైబర్ దాడులపై అవగాహన కల్పిస్తున్నాం.





# ఎన్నాళ్లకెన్నేళ్లకు.. దేవుని సేవకు..

ఖమ్మం నవంబర్ 29(భారత శక్తి ): దేవతామూర్తులకు శాస్త్ర, సంప్రదాయ సేవలు మరింతగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక ఏళ్ల తర్వాత దేవాలయాల్లో రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తద్వారా ఎనిమిది దేవాలయాల్లోని 19 పోస్టులు భర్తీ కానున్నాయి.

భర్తీకానున్న పోస్టులు

దేవాలయాల్లో వేద పారాయణదారులు, అర్చకులు, పంచారిక(గర్భాలయం శుభ్రం చేసేవారు), పాచక(వంట వండేవారు), సహాయ పాచక, డోలు, సన్నాయి, శ్రుతి వాయిద్యకారుల పోస్టులను అధికారులు భర్తీ చేయనున్నారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఖమ్మం కాల్వొడ్డు శ్రీసత్యనారాయణ సహిత శ్రీవీరాంజనేయస్వామి, కూసుమంచి మండలం జీళ్లచెర్వు శ్రీవెంకటేశ్వరస్వామి, పెనుబల్లి శ్రీనీలాద్రీశ్వరస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి, అశ్వారావుపేట మండలం వినాయకపురం శ్రీచిలకలగండి ముత్యాలమ్మ తల్లి, అన్నపురెడ్డిపల్లి మండలం శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లోని 19 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధిత ఈఓలు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు.

ఇవీ అర్హతలు..

అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. 18 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి 20రోజుల పాటు సంబంధిత దేవాలయాల్లో ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి ఈఓలు పంపిస్తారు. దరఖాస్తులను సహాయ కమిషనర్ కార్యాలయంలో ఓ కమిటీ పరిశీలిస్తుంది. అక్కడి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేరుతాయి. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి రాత, ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. 'ఆసక్తి కలిగిన అభ్యర్థులు 20 రోజుల్లోపు సంబంధిత దేవాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఉభయ జిల్లాల్లో ఆదాయం కలిగిన ఆలయాలు 86 ఉంటే, ఎనిమిదింటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నాం' అని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

# డిజిటల్ ముఠా దొరికింది..

, భీమవరం, నవంబర్ 29(భారత శక్తి ): భీమవరం పట్టణంఅంతర్జాతీయ డిజిటల్ ముఠాను పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. భీమవరానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ శర్మ నుంచి సైబర్ నేరగాళ్లు దఫదఫాలుగా రూ.78లక్షలు దోచుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న 13 మందిని గన్నవరం, విజయవాడ సమీపంలో అరెస్టు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి గురువారం వెల్లడించారు. నిందితుల నుంచి రూ.42 లక్షలు స్వాధీనపరచుకోవటంతో పాటు వివిధ బ్యాంకుల్లో రూ.19 లక్షల నగదును ఫ్రీజ్ చేశామని తెలిపారు. ప్రధాన సూత్రధారి రహతే జె నయన్ పరారీలో ఉన్నాడని చెప్పారు. నిందితులు కార్డ్ డీల్ పద్ధతిలో భారతీయుల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి కాంబోడియాకు పంపుతున్నట్లు గుర్తించామన్నారు. బాధితులకు ఫోన్లు చేసి డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరిస్తున్నారని తెలిపారు. నిందితుల్లో ఏడుగురు గతంలో కాంబోడియాలో కలిసి పనిచేశారని, ఇక్కడ మరికొంతమందితో కలిసి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు.

నిందితులు వీరే: ముంబయికి చెందిన రహతే జె నయన్ ఐదేళ్లుగా కాంబోడియాలో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. కాంబోడియాలో పనిచేసిన సమయంలో పుట్టగుంపుల శ్రీనివాస చౌదరి (బెంగళూరు), హైదరాబాద్‌కు చెందిన గద్రతి చిన్ని బ్లాండినా, గద్రతి శ్రీకాంత్, పిల్లి వంశీ ప్రసాద్, తమ్మినేని సునీల్‌కుమార్, విశాఖపట్నానికి చెందిన మామిడి వెంకట రోహిణీకుమార్, కూరగాయల ఈశ్వర్, కొమ్మినేని అజయ్ (ఖమ్మం), అనంతపురానికి చెందిన తల్లారి జయచంద్రకుమార్, మంక ముత్కవేమ నారాయణ (బాబు), ములకల రాజేష్, సత్యసాయి జిల్లాకు చెందిన పెద్దన్న మంజునాథ్‌రెడ్డి, పంకల హనుమంత్‌రెడ్డి పరిచయమయ్యారు. వీరందరూ అతడితో కలిసి ఈ నేరంలో పాలుపంచుకున్నారు.

# వ్యయం రూ.లక్షలు.. ఆయుష్షు గంటలు

కూసుమంచి: నవంబర్ 29(భారత శక్తి ): నిర్మించిన అంతర్గత సిమెంటు రహదారిని గంటల వ్యవధిలో జేసీబీతో ధ్వంసం చేశారు. కూసుమంచిలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20.90 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మూడు రోజుల క్రితం అంతర్గత రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఓ కుటుంబంలో సభ్యుల మధ్య వివాదం నేపథ్యంలో న్యాయస్థానంలో తీర్పు కోసం వేచిఉన్న భూమిలో రహదారి నిర్మించారంటూ అధికారులకు ఓ వర్గం ఫిర్యాదు చేసింది. దీంతో రహదారిని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. నిర్మించిన మార్గంలో 38మీటర్ల మేర జేసీబీతో గురువారం తొలగించారు. నిర్మించే ముందు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని పంచాయతీరాజ్ శాఖ ఏఈ రెయిన్‌హార్డ్ ౕ తెలిపారు.



## చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితి కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 29: శనివారం జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు.

జిల్లాలో మొదటి విడత నామినేషన్ ప్రక్రియ ఈ రోజుతో ముగియనున్న నేపథ్యంలో, శనివారం జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ నేటితో 29వ తేదీతో మొదటి విడత ముగియనున్నదని అన్నారు. 30వ తేదిన స్క్రూటినీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి క్రమబద్ధంగా స్వీకరించాలన్నారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్యాలయంలో తగిన వసతులు ఏర్పాటు చేయాలని సంబంధించిన సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సర్పంచ్, వార్డు స్థానాల కొరకు నిర్వహిస్తున్న ఎన్నికలను ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నామినేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించి అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డిఎల్ పిఓ శ్రీనివాస్, ఎమ్మార్వో జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలి: వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్

కడప, నవంబర్ 29(భారత శక్తి): అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని.. రైతులు వ్యవసాయంలో లాభదాయకమైన దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రైతన్నా.. మీకోసం" కార్యక్రమంలో భాగంగా.. చివరి రోజు శనివారం జిల్లాలోని ప్రొద్దుటూరు మండలం చెన్నంరాజుపల్లె గ్రామంలో రైతుల ఇంటి వెళ్లి రైతు సంక్షేమ



కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలను ఆయాన రైతులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమం ద్వారా చివరి రోజు వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,95,754 మంది రైతు కుటుంబాలను సందర్శించడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర అంశాలతో పాటు.. ప్రస్తుత రబీ సీజన్లో ఎదురయ్యే సవాళ్ళను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై రైతులతో చర్చించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మసేద్య, పశుసంవర్ధక శాఖ, డ్వామా, అనుబంధ శాఖల అధికారులు, గ్రామస్థాయి అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి సబ్ జైలు విజిట్




కడప, నవంబర్ 29(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో రాయచోటి సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# దిత్వా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### -కలెక్టరేట్ తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ ల ఏర్పాటు



కడప, నవంబర్ 29 (భారత శక్తి): దిత్వా తుఫాన్ ప్రభావం జిల్లాపై కూడా వుండనుండడంతో అప్రమత్తంగా ఉండాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

దిత్వా తుఫాను పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, సంసిద్ధతపై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తుఫాను ప్రభావం కారణంగా ఎదురయ్యే ఎలాంటి పరిణామాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాయంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా అధికారులు మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

వర్షాలు అధికంగా కురిస్తే రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువులు.. ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున.. పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబందిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు.

ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అలర్ట్ గా ఉండాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు.. రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా పాడి, పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే.. వెంటనే దానిని పునరుద్ధరించేలా చర్యలు చేయపట్టాలన్నారు. అన్ని మండలాల్లో తహాశీల్దార్లు తాత్కాలిక పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని, బాలింతలు, గర్భిణీలను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచి ప్రత్యేక సంరక్షణ అందివ్వాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపడుతున్న ముందస్తు సంసిద్ధత ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

అత్యవసర సహాయ సమాచార నిమిత్తం 29-11-2025 నుండి 04-12-2025 వరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంలో 21 మంది సిబ్బందికి 3 షిఫ్టుల్లో 24/7 విధులను కేటాయించడం జరిగిందన్నారు. అలాగే కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 - 246344

ఆర్డీవో కార్యాలయం, కడప : 08562 - 295990

ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 95028 36762

ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 6301432849

ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 98499 04111

పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబర్లతో పాటు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు కానీ ఫోన్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## పారిశుద్ధ కార్మికుల కుటుంబాల పట్ల మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్య ధోరణి కండనీయం : బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నాగేంద్ర



ఎమ్మిగనూరు, నవంబర్ 29(భారత శక్తి):ఎమ్మిగనూరు టౌన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి జి రంగన్న, ఏఐటీయూసీ తిమ్మ గురుడు, ఐ ఎఫ్ టి యు నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో గత 13 రోజులుగా చనిపోయిన పారిశుద్ధ కార్మికుల భార్యలు కారుణ్య నియామకాల కోసం నిరాహార దీక్ష చేస్తూ ఉన్న పరిస్థితిని స్వయంగా పరిశీలించిన బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నాగేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వాటిని పట్టించుకోకుండా బాధిత కుటుంబాలను రోడ్ల మీద పడేయడం పూర్తిగా అన్యాయం. కష్టాల్లో ఉన్న కార్మికుల కుటుంబాలను ఇలా అవమానించడం ప్రభుత్వ యంత్రాంగానికి మచ్చ" అని కఠినంగా వ్యాఖ్యానించారు.అలాగే ఆయన " పారిశుద్ధ కార్మికులు మన పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రాణాలు పెట్టి పనిచేస్తారు. వారి కుటుంబాలను పట్టించుకోకపోవడం మన సమాజానికి సిగ్గు. వెంటనే కారుణ్య నియామకాల ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి. లేనిపక్షంలో మున్సిపల్ కమిషనర్పై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం."అనిగడ్డం నాగేంద్ర కొత్త అంశాలను స్పష్టం చేస్తూ పేర్కొన్నారు.దీక్ష చేస్తున్న మహిళల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడానికి ప్రభుత్వం వెంటనే వైద్య బృందాన్ని పంపాలి.ఉద్యోగ నియామకాలపై మున్సిపల్ కమిషనర్ తీసుకున్న ఆలస్య నిర్ణయాలన్నింటిని పౌరులకు తెలపాలి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకటే విజ్ఞప్తి చేశారు రాష్ట్రంలో అన్నీ కారుణ్య నియామకాల పెండింగ్ కేసులను జిల్లా స్థాయిలో తక్షణమే పరిశీలించే,కమిటీ ఏర్పాటుకు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక వివిధ హక్కుల సంఘాలు పాల్గొన్నాయి.

## చిన్న మల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 29: జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డి లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సందర్శించారు.

వరి కొనుగోలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ను వేగవంతం చేయాలని,అవసరమైన టార్పాలిన్ షీట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని,రోజువారీగా ఎన్ని క్వింటాళ్ల వరి లోడింగ్ జరుగుతున్నది అన్న దాని పై పర్యవేక్షణ పెంచాలని ఐకెపి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

వరి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డిఎమ్ శ్రీకాంత్, ఏపీఎం మెప్మా శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.


# గవర్నర్ ప్రదీప్ ఆధ్వర్యంలో...నేడు వాసవి క్లబ్ స్వదీపోత్సవం!

**-పెద్ద ఎత్తున హాజరవుతున్న ప్రతినిధులు**

**-ముఖ్య అతిథులుగా ఇద్దరు ఎంపీలు, నిర్మల జగ్గారెడ్డి**

సంగారెడ్డి, నవంబర్ 29(భారత శక్తి) :వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఇరు కుల్ల ప్రదీప్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కంది శివారులోని లక్ష్మీనరసింహ కన్వెన్షన్ సెంటర్లో స్వదీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా గవర్నర్ గా ఇరుకుల్ల ప్రదీప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పరిధిలో ఉన్న వాసవి క్లబ్ ల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరిస్తారు. ప్రతి క్లబ్ వారు తమ పరిధిలో నిర్వహించిన సేవలపై నివేదిక సమర్పిస్తారు. దీనికిగాను ప్రతి క్లబ్ కు ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయించారు.వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కు కాబోయే అధ్యక్షుడు సిద్ద సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. అదేవిధంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు ,జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ జీఎం తుల్జా నాయక్, డిసిసిబి సీఈవో శ్రీనివాస్ ,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్, సి డి సి మాజీ చైర్మన్ విజయేందర్ రెడ్డి తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా వస్తున్నారు. ప్రోగ్రాం చైర్మన్గా పుల్లూరి ప్రకాష్ వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా కాన్ఫరెన్స్ ను సజావుగా నిర్వహించడానికి వివిధ కమిటీలను నియమించారు. ప్రతి క్లబ్ ఉత్సాహంగా పాల్గొనే విధంగా వివిధ కార్యక్రమాలను రూపొందించారు. క్లబ్ ల మధ్య ఆరోగ్యకరమైన పోటీని సృష్టించారు. ఫలితంగా ప్రతి ఈవెంట్ లో కూడా అన్ని క్లబ్బులు పాల్గొనే అవకాశం ఉంది. మహిళలకు యువతి యువకులకు చిన్నారులకు ప్రత్యేకంగా వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నీ పద్ధతి ప్రకారం జరిగేందుకుగాను సీనియర్లను

చైర్మన్ గా ,కో చైర్మన్ గా, సభ్యులుగా నియమించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాటు చేశారు. సందడిగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున వాసవి క్లబ్ సభ్యులందరూ ఆర్యవైశ్య ప్రతినిధులందరూ పాల్గొనాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ ఇరుకుల్ల ప్రదీప్ కోరారు. సంగారెడ్డి ప్రతిష్టను మరింత పెంచే విధంగా ఈ తొమ్మిదవ కాన్ఫరెన్స్ ను నిర్వహిస్తున్నట్లు ప్రదీప్ వెల్లడించారు. వాసవి క్లబ్ సీనియర్ లు అయిన గంప శ్రీనివాస్, మా శెట్టి ఉపేందర్, చందా శ్రీధర్ , కోర్తి వాడ రాజేందర్, భానూరి నరసింహులు, కంది చెందుగుప్త, కొంపల్లి విద్యాసాగర్ ,కొత్త వెంకటేశ్వరరావు తదితరులు కూడా ఈ స్వదీపోత్సవంలో పాల్గొంటున్నారని ఆయన వివరించారు.



# బుమ్రా ఒక్కడే నిలకడగా యార్కర్లు సంధించే బౌలర్: బ్రెట్ లీ



టీ20 ప్రపంచ కప్‌లో అందరి దృష్టి భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపైనే ఉందనడంలో సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన పేసర్లు ఉన్నప్పటికీ.. బుమ్రా వద్ద ఉన్న ప్రత్యేకత వారెవరికీ లేదనేది మాజీ క్రికెటర్ల మాట. అతడు సంధించే యార్కర్లను అడ్డుకోవడం హేమాహేమీ బ్యాటర్లకే సాధ్యపడదు. ఈ పొట్టి కప్‌లో బుమ్రాను ఎదుర్కోవడం చాలా కష్టమని ఆస్ట్రేలియా మాజీ పేసర్ బ్రెట్‌లీ వ్యాఖ్యానించాడు. డెత్ ఓవర్లలో అతడి బౌలింగ్ పదును మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపాడు.

''ఇటీవల కాలంలో బుమ్రాలా నిలకడగా యార్కర్లు వేసిన బౌలర్లను చూపించండి. అతడిలా మరింతమంది యార్కర్లను వేయడం చూడాలని ఉంది. కొందరు వేస్తున్నారు కానీ డెత్ ఓవర్లలో ఎక్కువగా సంధించడం లేదనేది నా అభిప్రాయం. ఈ ఐపీఎల్ సీజన్‌లో చాలాసార్లు 200ం స్కోర్లు నమోదయ్యాయి. పేసర్లు ఇంకాస్త వైవిధ్యంగా బంతులేయడం అలవాటు చేసుకోవాలి. స్కూప్ షాట్లతో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాలని అనుకొనే బ్యాటర్లను ఎదుర్కోవాలంటే యార్కర్లే కీలకం. వికెట్ల వెనక, థర్డ్‌మ్యాన్ దిశగా ఫీల్డర్లను పెట్టి అప్పుడు ఆ బంతిని వేస్తే.. షాట్ కొట్టేందుకూ బ్యాటర్లు బెంబేలెత్తిపోతారు. గతంలో 180 నుంచి 200 కొడితే చాలా మంచి స్కోరుగా భావించేవాళ్లం. ఇప్పుడు మాత్రం 260ం కొట్టినా గెలిచేవరకూ నమ్మకం ఉండటం లేదు. అందుకే, బ్యాటింగ్‌కు బౌలింగ్‌కు, బ్యాలెన్స్ చేయాల్సిన అవసరం లేకపోలేదు'' అని బ్రెట్ లీ వ్యాఖ్యానించాడు.

విరాట్ నుంచి చాలా నేర్చుకున్నా: విల్ జాక్స్

ఐపీఎల్‌లో ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహించిన ఇంగ్లాండ్ బ్యాటర్ విల్ జాక్స్ టీమ్‌ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీపై ప్రశంసలు కురిపించాడు. అతడినుంచి చాలా విషయాలను నేర్చుకున్నట్లు జాక్స్ తెలిపాడు. ''కోహ్లీ నుంచి మొదట గెలవాలనే యాటిట్యూడ్‌ను నేర్చుకున్నా. ప్రతిరోజూ మెరుగైన ప్రదర్శన చేయడంపై దృష్టిసారించా. చాలామంది అతడితో కలిసి పనిచేయడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పారు. కానీ అతడితో ఉంటే చాలా సులువుగా అనిపించింది. ప్రతీ బంతిని 100 శాతం అంచనా వేసి బాదేందుకు ప్రయత్నిస్తాడు. లక్ష్య ఛేదనలో కోహ్లీతో కలిసి ఆడటం ఎప్పుడూ మజానిస్తుంది. అవసరమైన సమయంలో రిస్క్ తీసుకోవడానికీ వెనుకాడడు'' అని జాక్స్ వివరించాడు.

# ప్రస్తుతం రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు: కపిల్ దేవ్



స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 2 - 0 తేడాతో టెస్ట్ సిరీస్ కోల్పోయింది. దీంతో హెడ్‌కోచ్ పదవిలో గౌతమ్ గంభీర్ కొనసాగాలా? వద్దా?.. అలాగే స్పిన్ ఆడే విషయంలో భారత బ్యాటర్ల సమర్థతపై క్రికెట్ విశ్లేషకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రవిచంద్రన్ అశ్విన్ నిష్క్రమణ తర్వాత భారత జట్టు సంధి దశలో ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం టీమ్‌ఇండియా సరైన మార్గంలో పయనిస్తోందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత్‌ను 1983 వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన అప్పటి జట్టు కెప్టెన్, క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ దీని మీద తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

'ప్రస్తుతం మనం ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నాం. దీంతో బ్యాటర్లు.. బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై బౌలర్లు సంధించే బంతులను ఎదుర్కొనే అవకాశాలు చాలా తక్కువగా వస్తున్నాయి. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపిక ప్రదర్శించాల్సి ఉంటుంది. అలాగే ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే.. రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు. టెస్టుల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే' అని కపిల్ దేవ్ అన్నారు.

'స్పిన్, పేస్‌ను సమర్థంగా ఎదుర్కోవాలంటే ఎంతో నైపుణ్యం ఉండాలి. కానీ టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయాలంటే చాలా కష్టం. అలాగే ఈ విషయంలో ఫుట్ వర్క్ అనేది చాలా కీలకపాత్ర పోషిస్తుందనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోకూడదు. రిషభ్ పంత్ విషయం మాత్రం వేరు. ఎందుకంటే అతడు సహజ సిద్ధమైన మ్యాచ్ విన్నర్. అతణ్ని డిఫెన్స్ ఆడమని మనం కోరలేం. ఎందుకంటే పంత్ సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడి, ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల సమర్థుడు. అలాంటి నైపుణ్యమున్న అతడికి.. మనం నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో 20 పరుగులు చేయమని చెప్పలేం' అని కపిల్ దేవ్ పేర్కొన్నారు.

# అతడు టెస్ట్ క్రికెట్ కన్నా... వైట్‌బాల్ క్రికెట్ పైనే దృష్టిపెట్టాలి: రవిచంద్రన్ అశ్విన్

: దక్షిణాఫ్రికాతో భారత్ తరపున రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడిన జస్‌ప్రీత్ బుమ్రా రేపటి (ఆదివారం) నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు మాత్రం దూరమయ్యాడు. వర్క్‌లోడ్ నేపథ్యంలో సెలక్టర్లు అతడికి విశ్రాంతినిచ్చారు. దీనితర్వాత ప్రారంభం కానున్న అయిదు టీ20 సిరీస్‌కు మళ్లీ అతడు జట్టులోకి రానున్నాడు. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ . కీలక వ్యాఖ్యలు చేశాడు. వైట్‌బాల్ క్రికెట్‌కే బుమ్రా ప్రాధాన్యమివ్వాలని, తప్పదు అనుకుంటేనే టెస్ట్ క్రికెట్ ఆడాలని అతడు సూచించాడు.

'నాకు బుమ్రాతో మంచి అనుబంధం ఉంది. నేను ప్రస్తుతం అతడికి దగ్గరగా ఉంటే.. బుమ్రాకు ఒకటే మాట చెబుతా.. వైట్ బాల్ క్రికెట్‌కే ప్రాధాన్యమివ్వమని సూచిస్తా. మరీ అవసరమైతే తప్ప టెస్ట్ క్రికెట్ ఆడవద్దని చెబుతా. కానీ అతడికి సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడటం అంటే చాలా ఇష్టమనే సంగతి నాకు తెలుసు. అతడు వీలైనంత కాలం టెస్ట్ క్రికెట్ ఆడటానికే మొగ్గు చూపుతాడు. అది చాలా




ఛాలెంజింగ్ విషయమని కూడా అతడికి తెలుసు' అని రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ఏబీ డివిలియర్స్‌తో చర్చిస్తూ అన్నాడు.

'బుమ్రా టీ20 క్రికెట్ ఆడటాన్ని నేను ఇష్టపడతాను. అతడు అర్థరహిత వన్డేలు ఆడాలని నేను కోరుకోవడం లేదు. టెస్ట్‌లు.. అది కూడా విదేశాల్లో జరిగే మ్యాచుల్లోనూ అతడు ఆడాలని కోరుకుంటున్నా. టీమ్‌ఇండియా స్వదేశంలో ఆడుతున్నప్పుడు ఇతర ఫాస్ట్ బౌలర్ల సేవల్ని ఉపయోగించుకోవాలి ' అని అశ్విన్ అన్నాడు. ఏబీ డివిలియర్స్ కూడా అశ్విన్‌ను ఈ విషయంలో సమర్థించాడు. 'ఉపఖండంలో టీమ్‌ఇండియా ఆడే టెస్ట్ మ్యాచ్‌ల్లో బుమ్రా ఆడొద్దు. అతడు కేవలం ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్‌ల్లో జరిగే టెస్టుల్లోనే ఆడాలి. అలాగే అతడు వరల్డ్ కప్ నేపథ్యంలో వైట్‌బాల్ క్రికెట్ మీద దృష్టి పెట్టాలి' అని సూచించాడు.

# నా ఆశయం మాత్రం అదే..: ఉమ్రాన్ మాలిక్



ఉమ్రాన్ మాలిక్ అనగానే 150 కి.మీ. వేగంతో దూసుకొచ్చే బంతులు గుర్తుకువస్తాయి. బౌలింగ్‌లో మంచి పేస్ ఉన్న అతడు భారత జట్టులో మాత్రం ప్లేస్ కోల్పోయాడు. ఉమ్రాన్ మాలిక్ టీమ్‌ఇండియాకు ఆడి చాలా రోజులవుతోంది. ప్రస్తుతం అతడు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జమ్మూకశ్మీర్ తరఫున ఆడుతున్నాడు. ఈ సందర్భంగా అతడు తన ఆశయాన్ని వెల్లడించాడు. కచ్చితంగా తిరిగి భారత జట్టులోకి వస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు.

'నేను ఇప్పుడు మెరుగైన ప్రదర్శనలు చేస్తున్నా. కచ్చితంగా తిరిగి భారత జట్టులోకి వస్తా అనే విశ్వాసం ఉంది. ఎందుకంటే ప్రస్తుతం నేను మాత్రమే 150 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించగలను. స్లో బాల్స్ మీద కూడా కసరత్తు చేస్తున్నా. అలాగే యార్కర్లపై కూడా దృష్టిపెడుతున్నా. రెడ్ బాల్ క్రికెట్లో వీటిని ఆచరణలో పెడుతున్నా' అని ఉమ్రాన్ మాలిక్.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్‌ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం అన్నాడు.

'సెలక్టర్లు నన్ను ఎప్పుడు జాతీయజట్టులోకి తీసుకుంటారనేది వారిష్టం. నేను మాత్రం ఇప్పుడు బాగా రాణిస్తున్నా. మరో విషయం ఏంటంటే అందరూ 150 కి.మీ. వేగంతో బౌలింగ్ చేయలేరు. ఆ వేగంతో బౌలింగ్ చేయాలంటే ఎంతో ధైర్యం ఉండాలి. నేను గత అయిదేళ్లుగా ఇదే వేగంతో బంతులు సంధిస్తున్నా' అని ఉమ్రాన్ మాలిక్ పేర్కొన్నాడు.

ఉమ్రాన్ మాలిక్ ఇప్పటివరకు 10 వన్డేలు, 9 టీ20ల్లో టీమ్‌ఇండియా తరఫున 24 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 2023లో వెస్టిండీస్ టూర్ తర్వాత నుంచి అతడు జాతీయజట్టుకు ఎంపిక కావడం లేదు. ఐపీఎల్‌లో అతడు ఇప్పటివరకు 29 వికెట్లు తీసుకున్నాడు. ఉమ్రాన్ మాలిక్ అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

# ఇదే మంచి తరుణం



దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో టీమ్‌ఇండియాకు గట్టి ఎదురు దెబ్బే తగిలింది. రెండు టెస్టుల్లోనూ ఓడి వైట్‌వాష్‌కు గురవడంతో తీవ్ర విమర్శలు తప్పలేదు. ఇప్పుడు అదే జట్టుతో వన్డే, టీ20 సిరీస్‌లు జరగబోతున్నాయి. వీటిలో జట్టు సత్తా చాటితే టెస్ట్ గాయాలకు కాస్త మందు రాసినట్లే! ఆదివారం మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, బుమ్రా, సిరాజ్ లాంటి కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతోంది భారత్. ఇందులో తమదైన ముద్ర వేయడానికి కొందరు ఆటగాళ్లు ఎదురు చూస్తున్నారు. వారి కెరీర్లకు ఈ సిరీస్ ఎంతో కీలకం. మరి ఆ ఆటగాళ్లు సత్తా చాటుతారా?

జడ్డూ.. అటో ఇటో

చాలా ఏళ్ల పాటు భారత వన్డే జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు రవీంద్ర జడేజా. అయితే ఇటీవల వన్డే జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన అతడిని ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయలేదు. ఫిట్‌గానే ఉన్నప్పటికీ ఆ సిరీస్‌కు జడ్డూను పక్కన పెట్టారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో మాత్రం ఛాన్స్ దక్కింది. కొన్ని రోజుల్లో జడ్డూ 37 ఏళ్లు పూర్తి చేసుకుంటుండం, ఈ మధ్య అతడి బౌలింగ్‌లో పదును తగ్గడంతో.. 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని భారత జట్టు ప్రత్యామ్నాయాల వైపు చూస్తోంది. అక్షర్, సుందర్ లాంటి స్పిన్ ఆల్‌రౌండర్ల నుంచి అతడికి పోటీ పెరిగింది. అక్షర్ పటేల్‌కు విశ్రాంతినివ్వడంతో జడ్డూకు దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో తుది జట్టులో చోటు ఖాయమైంది. ఈ సిరీస్‌లో జడ్డూ రాణించకపోతే వన్డేల్లో తన చోటు గల్లంతవడం ఖాయం. కాబట్టి ఇందులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పిస్తే తన కెరీర్‌ను పొడిగించుకోవడానికి అవకాశం దక్కుతుంది

పేస్ త్రయానికి పరీక్ష

షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న దక్షిణాఫ్రికాను భారత యువ పేసర్లు ఏమేర కళ్లెం వేస్తారన్నది ఆసక్తికరం. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలతో కూడిన పేస్ త్రయానికి ఈ సిరీస్ ఒక రకంగా పరీక్షే. అదే సమయంలో ఇది వారికి మంచి అవకాశం కూడా. ఈ ముగ్గురూ ఇప్పటిదాకా సీనియర పేసర్లకు సహాయ బౌలర్లుగానే ఉన్నారు. ఇప్పుడు వీళ్లే ప్రధానంగా పేస్ భారాన్ని మోయాల్సి ఉంది. అర్ష్‌దీప్ టీ20ల్లో తనేంటో రుజువు చేసుకున్నప్పటికీ.. వన్డేల్లో ఇంకా సత్తా చాటుకోలేదు. 11 మ్యాచ్‌లాడి 17 వికెట్లు తీసిన అర్ష్‌దీప్ ఇప్పుడీ సిరీస్‌లో పేస్ దళానికి నాయకుడిగా చెప్పొచ్చు. అతనే బౌలింగ్‌ను ఆరంభించే అవకాశముంది. మరి ఈ లెఫ్టార్మ్ పేసర్ జట్టుకు ఎలాంటి ఆరంభాలిస్తాడన్నది ఆసక్తికరం. టీ20ల్లో వికెట్ టేకర్‌గా తనకున్న పేరును ఇక్కడా నిలబెట్టుకుంటాడేమో చూడాలి. గంభీర్ మద్దతుతో ఎక్కువ అవకాశాలు అందుకుంటున్నాడనే పేరు సంపాదించిన హర్షిత్ రాణాపై ఈ సిరీస్‌లో అందరి కళ్లూ ఉంటాయనడంలో సందేహం లేదు. పేస్‌కు అనుకూలించే ఆస్ట్రేలియా వికెట్లపై అతను ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. భారత్‌లో రాణించడం అతడికి అంత తేలిక కాదు. బాగా పరుగులిచ్చేస్తాడన్న ముద్రను చెరిపేయడంతో పాటు వికెట్లూ తీయాలి. ఇక ఐపీఎల్‌లో వరుసగా రెండు సీజన్లు గొప్పగా రాణించిన ప్రసిద్ధ్ కృష్ణ.. అంతర్జాతీయ క్రికెట్లో మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్‌లో నిరాశపరచడంతో అతడిపై వేటు పడింది. ఇప్పుడు బుమ్రా, సిరాజ్ అందుబాటులో లేకపోవడంతో ఛాన్స్ దక్కింది. దీన్ని అతనెలా ఉపయోగించుకుంటాడో చూడాలి.

భలే ఛాన్సులే

ఐపీఎల్‌లో గత కొన్నేళ్లలో ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు యశస్వి జైస్వాల్. అక్కడ తన ఆట చూస్తే పరిమిత ఓవర్ల క్రికెట్‌కే అతను బాగా నప్పుతాడని అనిపిస్తుంది. కానీ ఆశ్చర్యకరంగా అతను టెస్టుల్లో స్థిరపడ్డాడు. రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. కానీ వన్డేలు, టీ20ల్లో మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. ఆ జట్లలోకి ఎంపికైనా తుది జట్టులో మాత్రం ఉండట్లేదు. అయితే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలతో దూరం కావడం ఇప్పుడు యశస్వికి వరంగా మారింది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో అతను తుది జట్టులో ఆడబోతున్నాడు. రోహిత్ శర్మతో కలిసి యశస్వినే ఇన్నింగ్స్‌ను ఆరంభించబోతున్నాడు. ఈ సిరీస్‌లో ఒకట్రెండు పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాడంటే యశస్విని ఇకపై వన్డే జట్టుకూ ఎంపిక చేయక తప్పని పరిస్థితి తలెత్తుతుంది. టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం అతడికి కలిసొచ్చేదే. ఈ ఫార్మాట్లో తన శైలికి తగ్గట్లు స్వేచ్ఛగా బ్యాటు ఝుళిపించే అవకాశం దక్కుతుంది. మరి ఈ అవకాశాన్ని అతను ఎంతమేర ఉపయోగించుకుంటాడో?

# అప్పటివరకు రో-కో ఆడొచ్చు

దిల్లీ: ఫిట్‌గా ఉన్నంతకాలం జట్టులో కొనసాగేందుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఎలాంటి అడ్డంకి లేదని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. 2027 ప్రపంచకప్‌లో స్టార్ ఆటగాళ్లు ఆడటంపై ఎదురైన ప్రశ్నకు అతడు బదులిస్తూ.. "రోహిత్, కోహ్లి నాణ్యమైన ఆటగాళ్లు. అనుభవంపై నాకు నమ్మకం ఎక్కువ. ఎందుకంటే అది ఎక్కడా దొరకదు. రోహిత్, కోహ్లి ఎన్నో విజయాల్లో కీలకపాత్ర పోషించారు. వాళ్లకు పెద్ద టోర్నీల్లో ఎలా ఆడాలో తెలుసు. ప్రత్యర్థిగా రో-కోను ఎదుర్కొన్నా. ఎలా బౌలింగ్ చేయాలో తెలియక నిద్ర కూడా పట్టేది కాదు.

2027 ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉంది. వారి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుంటే కచ్చితంగా ఈ కప్‌లో ఆడే జట్టులో ఉంటారు. ఫిట్‌గా ఉన్నంతవరకు వారు ఆడొచ్చు" అని మోర్నీ తెలిపాడు. టెస్టు క్రికెట్లో ఓటమిని మరిచిపోయి వన్డేలపై దృష్టి పెడితేనే జోరు మీదున్న దక్షిణాఫ్రికాను అడ్డుకోవచ్చని మోర్నీ పేర్కొన్నాడు.

# 'జై'డీపీ

## ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి ఆర్థిక వృద్ధి
## జులై-సెప్టెంబరులో 8.2%
## ఉపకరించిన జీఎస్టీ కోత



భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2% వృద్ధిని నమోదు చేసింది. ఇది ఆరు త్రైమాసికాల గరిష్ఠస్థాయి. జీఎస్టీ రేట్ల కోతలతో వినియోగం పెరుగుతుందనే అంచనాల మధ్య పరిశ్రమ ఉత్పత్తి అధికమైంది. అందువల్లే వ్యవసాయ ఉత్పత్తి తగ్గినా.. జీడీపీ రాణించగలిగింది.

వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం పదిలం..

2025-26 తొలి త్రైమాసిక వృద్ధిరేటు 7.8%, 2024-25 జులై-సెప్టెంబరులోని 5.6% తాజా గణాంకాలు మిన్నగా ఉన్నాయి. సేవల రంగం రెండంకెల వృద్ధి సాధించడమూ కలిసొచ్చింది. 2023-24 నాలుగో త్రైమాసికంలో నమోదైన 8.4% వృద్ధి తర్వాత, అత్యధిక వృద్ధి ఇదే. ప్రపంచంలోనే వేగవంతమైన పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం కొనసాగేందుకు తాజా గణాంకాలు ఉపకరించాయి. జులై-సెప్టెంబరులో చైనా వృద్ధి 4.8 శాతమే.

పూర్తి ఆర్థిక సంవత్సరానికి అంచనాలు మించొచ్చు

2025-26 ప్రథమార్థంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 8 శాతానికి చేరిందని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది. 2024-25 ఇదే సమయంలో జీడీపీ వృద్ధి 6.1 శాతంగా ఉంది. ప్రస్తుత వృద్ధి ఫలితంగా, 2025-26 మొత్తానికి ఆర్థిక సర్వేలో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధిరేటును సులువుగా అధిగమించొచ్చు.

సమీక్షిస్తున్న త్రైమాసికంలో తయారీ రంగం 9.1% వృద్ధి చెందింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇది 2.2 శాతంగా ఉంది. సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ రేట్ల కోత అమలవుతుందని ముందుగానే ప్రకటించడం, పండగల సీజను గిరాకీని అందుకోవడం కోసం పరిశ్రమలు ఉత్పత్తి పెంచడం ఇందుకు నేపథ్యం. సేవల రంగం 7.2% నుంచి 10.2 శాతానికి పెరగ్గా.. వ్యవసాయ రంగ వృద్ధి 4.1% నుంచి 3.5 శాతానికి పరిమితమైంది.

టారిఫ్‌ల ప్రభావం పడుతుంది అనుకున్నాం కానీ..

'పండగల సీజను వ్యయాల ఫలితంగా మూడో త్రైమాసికంలోనూ వృద్ధి ధోరణి కొనసాగుతుంది. పూర్తి ఆర్థిక సంవత్సర వృద్ధిరేటు అంచనాలను పెంచే అవకాశం ఉంద'ని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ అన్నారు. అంచనాలను మించి జీడీపీ గణాంకాలు నమోదయ్యాయని ఇక్రా ముఖ్యఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. 'అమెరికా టారిఫ్‌ల ప్రతికూల ప్రభావం, ప్రభుత్వ పరిమిత మూలధన వ్యయాల వల్ల వృద్ధిరేటుపై ప్రభావం పడుతుందని అనుకున్నాం. కానీ పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి 7% మించేలా పరిస్థితి కనిపిస్తోంద'ని ఆమె అన్నారు.

'ఈ గణాంకాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. వృద్ధికి అనుకూలమైన విధానాలు, సంస్కరణల ప్రభావాన్ని, అలాగే మా కృషి, ప్రజల సమిష్టితత్వాన్నీ ప్రతిబింబిస్తున్నాయి. సంస్కరణలను కొనసాగిస్తాం. ప్రతీ పౌరుడి సులభతర జీవితాన్ని మరింత బలోపేతం చేస్తాం' అని ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

'భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. సంస్కరణలు, ద్రవ్య స్థిరీకరణ చర్యలు ఇందుకు దోహదం చేశాయి. 8.2% వృద్ధితో, ప్రపంచంలోనే అత్యంత వేగవంత ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంద'ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

రెండో త్రైమాసికంలో వృద్ధిరేటు 8.2 శాతంగా నమోదు కావడం వల్ల, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద 7% అంతకు మించి వృద్ధి నమోదవుతుందని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ.356 లక్షల కోట్ల) స్థాయిని అధిగమిస్తుందని అంచనా వేశారు. ఈ ఏడాది మార్చి చివరకు 3.9 లక్షల కోట్ల డాలర్లుగా భారత ఆర్థిక వ్యవస్థ ఉందని అన్నారు.

2025లో 7%, వచ్చే ఏడాది 6.4% వృద్ధితో వర్ధమాన, ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్ ముందంజలో నిలబడగలదని మూడీస్ రేటింగ్స్ వెల్లడించింది. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థకున్న బలమైన మూలాలు, దేశీయ వృద్ధి చోదకాలుగా నిలిచాయని మూడీస్ పేర్కొంది. ఆసియా పసిఫిక్‌లో సగటు జీడీపీ వృద్ధి 2024లో 3.3% కాగా, 2025లో 3.6%, 2026లో 3.4 శాతానికి చేరగలదని మూడీస్ అంచనా వేసింది.

# 'బంగారం ధరలు నిర్ణయించే స్థాయికి భారత్'



దిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ఒకటి. పెద్ద మొత్తంలో బంగారం మన దేశంలో ఉన్నా.. దీని ధర నిర్ణయించే అధికారం మాత్రం లేదు. భవిష్యత్తులో మాత్రం ప్రపంచ గోల్డ్ మార్కెట్‌లో ధరలు నిర్ణయించే దేశంగా భారత్ ఎదగనుందని, ఇందుకు సొంత గనుల నుంచి వచ్చే బంగారం కీలక భూమిక పోషిస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే దశాబ్ద కాలంలో దేశ బంగారు అవసరాలను సుమారు 20 శాతం సొంత గనులే తీర్చనున్నాయని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా ( ఆధ్వర్యంలో నిర్వహించిన జెమ్స్ అండ్ జ్యువెలరీ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు.

వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో గోల్డ్ మైనింగ్ కీలక భూమిక పోషించబోతోందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా రీజనల్ సీఈఓ సచిన్ జైన్ అన్నారు. దేశీయంగా గనుల తవ్వకం వల్ల ఇండియన్ గోల్డ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు, ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కూడా వస్తాయని చెప్పారు. దేశంలో గణనీయమైన బంగారు గనులు లేకపోవడం, గోల్డ్ బ్యాంకింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రైస్ టేకర్‌గా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం లండన్ ఏఎం, పీఎం బెంచ్‌మార్క్ ధరలను అనుసరిస్తున్నామని చెప్పారు. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పులతో రానున్న రోజుల్లో మనమే ధరలు నిర్ణయించే స్థాయికి చేరుకుంటామని సచిన్ జైన్ ధీమా వ్యక్తంచేశారు. వచ్చే రెండు మూడేళ్లలో భారత్ ప్రపంచ జ్యువెలరీ హబ్‌గా ఎదగనుందని అభిప్రాయపడ్డారు.

భారతీయుల దగ్గర సుమారు 25 వేల టన్నుల బంగారం ఉందని ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన నోవల్ జువెల్స్ సీఈఓ సందీప్ కోహ్లీ అన్నారు. ప్రభుత్వం వద్ద 800 టన్నుల బంగారం ఉందన్నారు. అదే స్విట్జర్లాండ్ ప్రభుత్వం వద్ద వెయ్యి టన్నులుంటే.. ప్రజల వద్ద 200 టన్నులు మాత్రమే ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుగా ఉన్న భారత్.. బంగారం ధరలను నిర్ణయించే స్థితిలో లేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని కోహ్లీ అన్నారు. అయితే ఖరీదైన కారు, స్మార్ట్‌ఫోన్ కొనుగోలు విషయంలో లేని ఆందోళన.. బంగారం విషయంలో మాత్రం ఉంటోందన్నారు. ఆన్‌లైన్‌లో పోల్చుకునే సౌలభ్యం లేకపోవడమే కారణమని చెప్పారు.

బంగారం ధరలు నిర్ణయించడంలో ప్రపంచ స్థాయికి ఎదగాలంటే సోర్సింగ్, మార్కెటింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత అవసరమని ఎంఎంటీసీ పీఏఎంపీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సమిత్ గుహ అన్నారు. బీఐఎస్ అందిస్తున్న హాల్‌మార్కింగ్‌ను కొనియాడుతూనే మరింత మెరుగైన విధానాలు అవసరమని అభిప్రాయపడ్డారు. 2012-13 ఆర్‌బీఐ విధించిన నిబంధన వల్ల 24 క్యారెట్ బులియన్ ఎగుమతిపై నిషేధం ఎదుర్కొంటున్నామని చెప్పారు. గ్లోబల్ ఎక్స్ఛేంజీలో భారతీయ బులియన్ సరఫరా చేయాలంటే ఈ నిబంధనపై ఒకసారి పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# మరింత సురక్షితంగా డిజిటల్ బ్యాంకింగ్




డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సురక్షితం, సులభతరం చేయడంతో పాటు, ప్రమాణీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధమయ్యింది. ఇందుకోసం 'డిజిటల్ బ్యాంకింగ్ ఛానల్స్ ఆథరైజేషన్ డైరెక్షన్స్-2025' పేరుతో కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. 2026 జనవరి 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా, అన్ని వాణిజ్య బ్యాంకులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను అందించడంలో ఏకరూపత, కఠిన నిబంధనలను తీసుకురావడమే ఈ మార్గదర్శకాల లక్ష్యం. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థకు ఇది ఒక కొత్త అధ్యాయంగా, ఖాతాదారులకు మరింత భద్రత, సౌకర్యం లభిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఆన్‌లైన్ ఛానల్స్ నియంత్రణతో పాటు లావాదేవీల భద్రత మెరుగుపర్చేందుకు ఆర్‌బీఐ ఈ చర్యలు తీసుకుంటోంది. వెబ్‌సైట్లు, మొబైల్ బ్యాంకింగ్ తదితరాలన్నీ ఈ మార్గదర్శకాల పరిధిలోకి వస్తాయి. 2025 చివరికి డిజిటల్ బ్యాంకింగ్ వినియోగదారులు 80 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని ఆర్‌బీఐ అంచనా వేసింది.

రెండు రకాలుగా...

ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను జనవరి 1 నుంచి రెండు రకాలుగా పరిగణించనున్నారు.

చూడటానికే: ఖాతాదారుకు పరిమిత సేవలు మాత్రమే అందుబాటులో ఉండటం. అంటే, తన ఖాతాలో ఉన్న నగదు నిల్వ చూసుకోవడం, ఖాతా స్టేట్‌మెంట్లు తీసుకోవడం లాంటివి. ఈ సౌకర్యం ఎంచుకున్నప్పుడు నిధుల బదిలీకి సంబంధించిన ఏ సేవలకూ ఖాతాదారుడిని బ్యాంకులు బాధ్యత చేయలేవు.

లావాదేవీల సౌకర్యం: నిధుల బదిలీ, ఇతర బ్యాంకింగ్ సేవలన్నీ అందుబాటులో ఉండేలా అవకాశం ఉంటుంది.

ఈ వర్గీకరణ ద్వారా బ్యాంకులు తమ ఖాతాదారులకు సరైన సేవలను అందించేందుకు తోడ్పడతాయి. ఉదాహరణకు కొత్త వినియోగదారులు ముందుగా 'వ్యూ ఓన్లీ' విధానంలో చేరి, ఆ తర్వాత ట్రాన్సాక్షనల్ సేవలకు మారొచ్చు. దీనివల్ల మోసాలను నివారించేందుకు వీలవుతుంది.

బ్యాంకులు అనుమతి తీసుకోవాలి..

డిజిటల్ ఛానల్స్‌ను ప్రారంభించాలంటే బ్యాంకులు ఆర్‌బీఐ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. దీనికి సంబంధించిన అన్ని అనుమతులూ తీసుకోవాలని ఆర్‌బీఐ పేర్కొంది. సాంకేతికంగా కాస్త వెనకబడిన బ్యాంకులకు ఇది కొద్దిగా సవాలుగానే కనిపిస్తోంది. కానీ, దీర్ఘకాలంలో బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇది తప్పనిసరి అని ఆర్‌బీఐ పేర్కొంటోంది.

ఒత్తిడి చేయొద్దు..

ఖాతాదారుల హక్కులను కాపాడేందుకు మార్గదర్శకాల్లో పలు సూచనలూ ఆర్‌బీఐ చేసింది. ఆన్‌లైన్ ఛానెల్స్‌కోసం రిజిస్ట్రేషన్/డీరిజస్ట్రేషన్ కోసం ఖాతాదారుల నుంచి స్పష్టమైన అనుమతి తీసుకోవాలి. లావాదేవీలకు సంబంధించి ఎస్ఎంఎస్/ఇ-మెయిల్ పంపించాలి. షరతులు, నిబంధనలను స్పష్టమైన, సరళమైన భాషలో (ఆంగ్లం, హిందీ, స్థానిక భాషల్లో) అందించాలి. ఛార్జీలు, వివాదాల పరిష్కార విధానాలు, స్టాప్-పేమెంట్ ప్రక్రియలు తదితరాలన్నీ ఉండాలి.

డెబిట్ కార్డులు, ఇతర సేవలతో బ్యాంకుల డిజిటల్ ఛానెల్స్‌ను ముడిపెట్టకూడదు. వినియోగదారుడి ఎంపికకే ప్రాధాన్యం ఇవ్వాలి.

# ఏఐ టూల్స్‌కు విశ్వసనీయత ముఖ్యం





హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై నమ్మకం కలిగించడం ఎంతో ముఖ్యమని.. ఒక చిన్న తప్పు జరిగినా ఈ అధునాతన సాంకేతికతపై విశ్వాసం సన్నగిల్లుతుందని క్వాలిటీ ఇంజినీరింగ్ సదస్సు 'క్యూఈ కాంక్లేవ్ 2025'లో వక్తలు హెచ్చరించారు. ఏఐ టూల్స్‌ను పూర్తిగా పరీక్షించి, తప్పులు జరగవని నిర్ధారించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ సదస్సులో వివిధ కంపెనీలకు చెందిన దాదాపు 600 మంది ఇంజినీర్లు, సీఎక్స్‌ఓలు, క్వాలిటీ పరిశోధకులు పాల్గొన్నారు. క్వాలిజీల్ సహవ్యవస్థాపకుడు మధుమూర్తి రోణంకి మాట్లాడుతూ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ముందు, దాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించడానికి టెస్టింగ్ టూల్స్ అవసరమని పేర్కొన్నారు. 'వాలిడేట్' అనే ఏఐ వాలిడేషన్, ట్రస్ట్ ఇంజినీరింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించారు. ఎన్ఐఎస్‌టీకి చెందిన ఏఐ రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రైమ్‌వర్క్ (ఆర్ఎంఎఫ్), ఐఎస్ఓ/ఐసీఈ 42001 ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు మధుమూర్తి తెలిపారు.

# రోజూ రెండు కొత్త ఫార్మసీ స్టోర్లు

, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ గ్రూపు సంస్థ అయిన అపోలో ఫార్మసీ విస్తరణ బాటలో ఉంది. రోజూ 2 కొత్త ఫార్మసీ స్టోర్లు ప్రారంభించాలని, అయిదేళ్లలో 10 కోట్ల మంది వినియోగదార్లను సంపాదించుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. తాజాగా ఈ సంస్థ 7,000 ఫార్మసీ స్టోర్ల సంఖ్యను చేరుకుంది.

7,000వ స్టోర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రారంభించారు. రోజూ తమకు 10 లక్షలకు పైగా మందుల ఆర్డర్లు లభిస్తున్నాయని అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ శోభన కామినేని తెలిపారు. అపోలో ఫార్మసీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన అపోలో 24/7 యాప్, దేశంలోని 19,000 పిన్‌కోడ్‌లకు మందులు పంపిణీ చేస్తోందని అన్నారు. అపోలో వైద్యులతో ఆన్‌లైన్ కన్సల్టేషన్, డయాగ్నొస్టిక్, ఆరోగ్య బీమా సేవలనూ అందిస్తున్నట్లు వివరించారు. ఫీజుతో లభించే ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం 'అపోలో సర్కిల్' సభ్యుల సంఖ్య కోటికి చేరుకుందని అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్ అన్నారు.

# నీళ్లను రోజూ మరీ అతిగా, మోతాదుకు మించి తాగుతున్నారా..?



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని వేళకు తీసుకోవడం, వ్యాయామం చేయడంతోపాటు రోజుకు తగినన్ని నీళ్లను కూడా తాగాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. నీళ్లను తాగడం వల్ల అనేక జీవక్రియలు సాఫీగా సాగుతాయి. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అయితే రోజుకు ఎవరైనా సరే కనీసం 2 నుంచి 3 లీటర్ల నీళ్లను లేదా 8 నుంచి 10 గ్లాసుల మేర నీళ్లను తాగాల్సి ఉంటుందని వైద్యులు మనకు సూచిస్తుంటారు. ఇది నిజమే అయినప్పటికీ మనం నివసించే వాతావరణ పరిస్థితులు, మన ఆరోగ్యం, ఉష్ణోగ్రత, శరీర బరువు, మనకు ఉండే వ్యాధులు వంటి అంశాలను ఆధారంగా చేసుకుని కూడా మనం రోజూ నీళ్లను తాగాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే వ్యక్తిని బట్టి రోజుకు తాగాల్సిన నీటి శాతం నిర్ధారించబడుతుంది. అయితే నీళ్లను ఎవరైనా సరే తగిన మోతాదులోనే తాగాల్సి ఉంటుంది. అలా అని మరీ అతిగా తాగితే అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

శరీరం వాపులకు గురై..

నీటిని మరీ అతిగా తాగడం వల్ల శరీరంలో ద్రవాలు అధికంగా చేరుతాయి. దీని వల్ల శరీరంలో ఉండే ద్రవాల పరిమాణం మారుతుంది. ద్రవాల సమతుల్యత లోపిస్తుంది. దీంతో శరీరంలో లవణాల శాతం తగ్గుతుంది. ఫలితంగా ద్రవాలు ఎక్కువగా చేరి శరీరం వాపులకు గురవుతుంది. ముఖ్యంగా పాదాలు, కళ్లు, ముఖం, చేతులు వాపులకు గురై కనిపిస్తాయి. అలాగే కొందరికి వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి కండరాలు పట్టేస్తాయి. కండరాలు నొప్పులుగా ఉంటాయి. ముఖ్యంగా రాత్రి పూట ఇలా ఎక్కువగా జరుగుతుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోతుంటాయి. అలాగే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. చిన్న పనిచేసినా కూడా విపరీతంగా అలసిపోతారు.

ఓవర్ హైడ్రేషన్..

నీటిని సరిగ్గా తాగకపోతే ఏర్పడే స్థితిని డీహైడ్రేషన్ అంటారు. అదే నీటిని మరీ అతిగా సేవిస్తే ఏర్పడే పరిస్థితిని ఓవర్ హైడ్రేషన్ అంటారు. ఇవి రెండూ కూడా వాస్తవానికి ప్రమాదకరమే. ఈ రెండు సందర్భాల్లోనూ విపరీతమైన తలనొప్పి వస్తుంది. రక్తంలో ఉప్పు శాతం తగ్గుతుంది. దీంతో కణాలు వాపులకు గురవుతాయి. దీని వల్ల ఒళ్లు నొప్పులు, వాపులు వస్తాయి. ఇక అధికంగా నీటిని తాగితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల కండరాలు పట్టేయడం, నొప్పులు వంటి సమస్యలు వస్తాయి. కండరాల పనితీరు మందగించి కండరాలు బలహీనంగా మారుతాయి. నీటిని మోతాదుకు మించి సేవిస్తే కిడ్నీలపై భారం పడుతుంది. శరీరంలో అధికంగా ఉండే ద్రవాలను బయటకు పంపేందుకు కిడ్నీలు శ్రమించాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది కిడ్నీల డ్యామేజ్‌కు దారి తీస్తుంది. కనుక నీళ్లను మరీ అతిగా సేవించకూడదు.

గుండెపై ప్రభావం..

ఇక నీళ్లను మోతాదుకు మించి తాగడం వల్ల శరీరంలో పొటాషియం లెవల్స్ పడిపోతాయి. దీని వల్ల రక్త సరఫరా తగ్గుతుంది. బీపీ అసాధారణ రీతిలో పెరుగుతుంది. దీని ప్రభావం గుండెపై పడుతుంది. దీర్ఘకాలంలో ఇది హార్ట్ ఎటాక్‌కు దారి తీసే అవకాశం ఉంటుంది. అలాగే కాళ్ల నొప్పులు వస్తుంటాయి. తీవ్రమైన విసుగ్గా ఉంటుంది. మూడ్ మారుతుంది. ఎల్లప్పుడూ చిరాగ్గా ఉంటారు. కొందరికి ఛాతిలో తరచూ నొప్పి కూడా వస్తుంది. నీళ్లను మోతాదుకు మించి అతిగా తాగడం వల్ల ఎక్కువ సార్లు మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. దీంతో నిద్రకు ఆటంకం కలుగుతుంది. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన సైతం పెరుగుతాయి. ఇలా అతిగా నీళ్లను తాగడం వల్ల అనేక అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుక నీళ్లను రోజూ తగినంత మోతాదులోనే తాగాల్సి ఉంటుంది.

# మీరు ఈ పొరపాట్లు చేస్తున్నారా..?

వయస్సు మీద పడే కొద్దీ ఎవరికైనా సరే సహజంగానే ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి బలహీనంగా మారుతాయి. శరీరంలో క్యాల్షియం తగ్గడంతోపాటు పలు ఇతర కారణాల వల్ల ఇలా ఎముకలు బలం కోల్పోతాయి. వృద్ధాప్యంలో ఎవరికైనా ఇలాగే జరుగుతుంది. అయితే ప్రస్తుతం చాలా మందికి యుక్త వయస్సులోనే ఎముకలు బలహీనంగా మారి విరిగిపోతున్నాయి. ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి పెళుసుగా మారుతున్నాయి. దీంతో శక్తి లేనట్లు ఫీలవుతున్నారు. బలంగా ఉండడం లేదు. చిన్నారుల్లో కూడా ఎదుగుదల సమస్యలు వస్తున్నాయి. అయితే ఇలా యుక్త వయస్సులోనే ఎముకలు బలహీనంగా మారకూడదు. అలా మారుతున్నాయంటే అందుకు చాలా బలమైన కారణాలే ఉంటాయి. ముఖ్యంగా కొందరు పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి వల్లే ఎముకలు అలా బలహీనంగా మారుతుంటాయి. కనుక పొరపాట్లు ఎలా, ఎక్కడ చేస్తున్నారో గమనించాల్సి ఉంటుంది.

పొగ తాగడం..

చాలా మంది ప్రస్తుతం యుక్త వయస్సులో ఉన్నవారు సైతం పొగ అధికంగా తాగుతున్నారు. స్మోకింగ్ అనేది యువతలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తమ తోటి



స్నేహితులు తాగుతున్నారని తాము కూడా పొగ తాగడం మొదలు పెడుతున్నారు. ఇలా వారు పొగ తాగడం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ అధికంగా ఉత్పత్తి అవుతాయి. ఇవి శరీరానికి అత్యంత హాని చేస్తాయి. క్యాల్షియం నిల్వలను తగ్గిస్తాయి. ఎముకలు బలహీనంగా మారేలా చేస్తాయి. దీంతో ఎముకల సాంద్రత సైతం తగ్గిపోతుంది. చివరకు ఎముకలు బలహీనంగా మారుతాయి. కనుక పొగ తాగడం మానేయాలి. యుక్త వయస్సులోని వారే కాదు, అసలు ఎవరూ కూడా పొగ తాగడం మంచిది కాదు. అది ఎముకలకు తీవ్రమైన హాని కలగజేస్తుంది.

అధికంగా మద్యం సేవించడం..

ప్రస్తుతం చాలా మంది కూర్చుని చేసే ఉద్యోగాలనే అధికంగా చేస్తున్నారు. రోజూ గంటల తరబడి కుర్చీల్లో కూర్చునే ఉంటున్నారు. దీని వల్ల శారీరక శ్రమ తగ్గుతోంది. ఫలితంగా ఎముకలు బలహీనంగా మారుతున్నాయి. కనుక ఇలాంటి వారు రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయాల్సి ఉంటుంది. కనీసం 30 నిమిషాల పాటు అయినా సరే వాకింగ్ చేయాలి. దీని వల్ల ఎముకలు బలహీనంగా మారకుండా ఆరోగ్యంగా ఉంటాయి. దృఢంగా ఉంటారు. ఇక రోజూ విపరీతంగా మద్యం సేవిస్తున్నా కూడా శరీరానికి మంచిది కాదు. ముఖ్యంగా దీని వల్ల ఎముకలపై ప్రభావం పడుతుంది. దీంతో క్యాల్షియం నిల్వలు తగ్గి ఎముకలు బలహీనంగా మరి సులభంగా విరిగిపోయే అవకాశాలు పెరుగుతాయి. అతిగా మద్యం సేవించే చాలా మంది చిన్న యాక్సిడెంట్ తరువాత ఎముకలు విరిగితే హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నప్పటికీ కొంతకాలానికి ప్రాణాంతకంగా మారి చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కనుక మద్యం అతిగా సేవించకూడదు.

ఉప్పు అధికంగా తినడం..

ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలను చాలా మంది అధికంగా తింటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత ఇలాంటి ఆహారాలను అధికంగా తింటున్నారు. కనుక వారిలో ఎముకలు బలహీనంగా మారి సులభంగా విరిగిపోతున్నాయి. కనుక ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు తీసుకోవడాన్ని తగ్గించాలి. లేదా పూర్తిగా మానేసి ప్రత్యామ్నాయ ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అలాగే చాలా మంది ఎముకల బలం కోసం క్యాల్షియం ఉండే ఆహారాలను తరచూ తీసుకుంటారు. కానీ దీంతోపాటు మన ఎముకల ఆరోగ్యానికి విటమిన్లు డి, కె కూడా అవసరమే. కనుక ఈ విటమిన్లు ఉండే ఆహారాలను తీసుకుంటేనే మన ఎముకలకు మేలు జరుగుతుంది. ఎముకలు బలహీనంగా మారకుండా దృఢంగా ఉంటాయి. సులభంగా విరిగిపోకుండా జాగ్రత్త పడవచ్చు. ఇలా ఆయా పొరపాట్లు జరగకుండా చూసుకుంటే ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఏమిటో.. వీటి వల్ల కలిగే లాభాలు ఏమిటో తెలుసా..?




మన శరీరానికి విటమిన్లు, మినరల్స్ వంటి అనేక పోషకాలు అవసరం అవుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే పోషకాలు అంటే చాలా మంది ఇవే అనుకుంటారు. కానీ ఇంకా మన శరీరానికి కావల్సిన పోషకాలు అనేకం ఉన్నాయి. వాటిల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు కూడా ఒకటి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. పలు ఆహారాల్లో ఉంటాయి. అయితే చాలా మందికి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అంటే తెలుసు. కానీ మరి ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఏమిటి..? వీటితో మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయి..? ఏయే ఆహారాలను తీసుకుంటే వీటిని పొందవచ్చు..? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఆరోగ్యకరమైన కొవ్వులు. ఇవి పలు ఆహారాల్లో ఉంటాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లలాగే ఇవి కూడా ఆరోగ్యకరమైన కొవ్వుల్లో ఒక రకానికి చెందినవి. అందువల్ల వీటిని కూడా మనం తరచూ తీసుకోవాల్సి ఉంటుంది. ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. వీటి వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇంకా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లను మన శరీరం తనంతట తానుగా తయారు చేసుకోలేదు. మనం వీటిని ఆహారం ద్వారా శరీరానికి అందించాల్సి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరం నిర్మాణం, ఎదుగుదల సరిగ్గా ఉంటాయి. మెదడు పనితీరు మెరుగు పడుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి సురక్షితంగా ఉంటుంది. అలాగే ఎముకలు దృఢంగా మారుతాయి.

స్త్రీ, పురుషుల్లో లోపాలు తగ్గేందుకు..

ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీని వల్ల స్త్రీ, పురుషుల్లో ఉండే లోపాలు తగ్గుతాయి. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు పలు రకాల రూపంలో ఉంటాయి. సాధారణంగా ఇవి లినోలిక్ యాసిడ్ రూపంలో మనకు ఎక్కువగా లభిస్తాయి. ఇది మన శరీరంలో గామా-లినోలిక్ యాసిడ్ (జీఎల్ఏ)గా మార్పు చెందుతుంది. దీన్నే ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్ అంటారు. ఇది శరీరంలోని వాపులను తగ్గిస్తుంది. దీని వల్ల గుండె పోటు, పక్షవాతం రాకుండా చూసుకోవచ్చు. ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు మనకు ఎక్కువగా నూనెలు, విత్తనాల ద్వారా లభిస్తాయి.

వేటిలో లభిస్తాయి..

ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా బాదంపప్పు, వాల్ నట్స్, పిస్తా, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు, పల్లీలు, చేపలు, మటన్, చికెన్, గుడ్లు వంటి ఆహారాల ద్వారా లభిస్తాయి. అందువల్ల ఈ ఆహారాలను తరచూ తీసుకుంటే ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు లభించి ఆరోగ్యంగా ఉంటారు.

# నెయ్యితో ఇంటి చిట్కాలు.. ఏయే అనారోగ్య సమస్యలకు నెయ్యిని ఎలా ఉపయోగించాలంటే..?

%ఎశీఎవ =వఎవఎఅవం ఔఊష్ట +ష్ట్రవవ% ఎ భారతీయులు నెయ్యిని ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు దాదాపుగా అందరు ఇళ్లలోనూ నెయ్యి ఉండేది. కానీ ఇప్పుడు నెయ్యిని బయట కొనాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే ఆయుర్వేద ప్రకారం నెయ్యిలో అనేక ఔషధ గుణాలు, పోషకాలు ఉంటాయి. అందువల్ల నెయ్యిని తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. నెయ్యిలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇందులో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఎ, డి, ఇ, కె, బ్యుటీరిక్ యాసిడ్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఒకప్పుడు చాలా మంది రోజూ నెయ్యిని భోజనంలో తినేవారు. కానీ ఇప్పుడు అలా తినడం లేదు. కనీసం చిన్నారులకు సైతం నెయ్యిని తినిపించడం లేదు. అయితే నెయ్యితో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ దీన్ని పలు ఇంటి చిట్కాల్లో ఎలా ఉపయోగించాలి, దీంతో ఎలాంటి అనారోగ్య సమస్యలను ఏవిధంగా నయం చేసుకోవచ్చు.. అని చాలా మందికి తెలియదు. ఈ క్రమంలోనే ఈ విషయాలను ఆయుర్వేద వైద్యులు తెలియజేస్తున్నారు.

ప్రస్తుతం చాలా మందికి మలబద్ధకం సమస్య ఉంటోంది. అలాంటి వారికి నెయ్యి అద్భుతంగా పనిచేస్తుంది. ఒక టీస్పూన్ నెయ్యిని కరిగించి దాన్ని రాత్రి పూట నిద్రకు ముందు ఒకటీస్పూన్ మోతాదులో సేవించాలి. లేదా ఉదయం పరగడుపునే కూడా తీసుకోవచ్చు. ఇలా చేస్తుంటే మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. నెయ్యిలో ఉండే బ్యుటీరిక్ యాసిడ్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. అలాగే ఈ యాసిడ్ వల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి సమస్య ఉండదు. దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నవారు నెయ్యిని కరిగించి రెండు చుక్కల మోతాదులో రెండు ముక్కు రంధ్రాల్లోనూ వేస్తుండాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయాలి. దీని వల్ల కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

బరువు తగ్గేందుకు..

నెయ్యి అంటే కొవ్వులు ఉంటాయి కనుక దీన్ని తింటే బరువు పెరుగుతారని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. మరీ అధికంగా నెయ్యిని తిన్నా, దీంతో వేపుడు వంటి పదార్థాలను, తీపి పదార్థాలను చేసి తిన్నా బరువు పెరుగుతారు. కానీ నెయ్యిని నేరుగా తీసుకుంటే బరువు తగ్గుతారు. నెయ్యిని రోజూ ఒక టీస్పూన్ మోతాదులో ఉదయం పరగడుపునే తింటుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు,



శరీరానికి అవసరం అయిన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కొవ్వు కణాలపై పనిచేస్తాయి. కొవ్వు కరిగేలా చేస్తాయి. నెయ్యిలో ఉండే ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు కూడా కొవ్వును కరిగించేందుకు సహాయం చేస్తాయి. కనుక నెయ్యిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ కనీసం ఒక టీస్పూన్ మోతాదులో నెయ్యిని తింటుంటే ఉపయోగం ఉంటుంది. దీంతో బరువును సులభంగా తగ్గించుకోవచ్చు.

షుగర్ ఉన్నవారికి..

ఇక షుగర్ ఉన్నవారికి కూడా నెయ్యి మేలు చేస్తుంది. సాధారణంగా షుగర్ ఉన్నవారు అన్నం తినేందుకు వెనుకాడుతారు. చపాతీలను అధికంగా తింటారు. కానీ నెయ్యి వేసి కలిపితే అన్నం గ్లైసీమిక్ ఇండెక్స్ తగ్గుతుంది. దీంతో అలాంటి అన్నాన్ని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగవు. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు అన్నాన్ని తినదలిస్తే కాస్త నెయ్యి వేసి తింటే ఉపయోగం ఉంటుంది. అలాగే నెయ్యిని చపాతీలపై వేసి కాల్చి కూడా తినవచ్చు. ఇలా చేసినా కూడా చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ తగ్గుతుంది. దీంతో అలాంటి చపాతీలను తింటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy